ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





మేడపాడు పౌల్ట్రీ ఫారంలో చనిపోయిన కోళ్లు

బర్డ్ ఫ్లూ భయం లేదు

నాలుగైదు రోజులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అలజడి సృష్టించిన బర్డ్‌ఫ్లూపై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ఇరు జిల్లాల కలెక్టర్లు వెట్రి సెల్వి, నాగరాణి ప్రజలకు పిలుపునిచ్చారు. మృత్యువాత పడిన కోళ్లను ప్రత్యేక పద్ధతుల్లో ఖననం చేశారు. వైరస్ మరింత విస్తరించకుండా ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటున్నారు. వేల్పూరు, బాదంపూడి ప్రాంతాల్లోని పది కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు మినహా మిగిలిన ప్రాంతాల వారు కోడి గుడ్లను, చికెన్‌ను బాగా ఉడకబెట్టి తినవచ్చని అధికారులు ప్రకటించారు.



బాదంపూడి పౌల్ట్రీలో మృతి చెందిన కోళ్లను పీపీఈ కిట్ల నడుమ పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

అధికార యంత్రాంగం అప్రమత్తం

- అసత్య ప్రచారాలు చేయవద్దని ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు
- శాస్త్రీయ పద్ధతుల్లో కోళ్ల ఖననం : పశ్చిమ కలెక్టర్ నాగరాణి
- బాదంపూడి, వేల్పూరుల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు
- మేడపాడు పౌల్ట్రీ ఫారంలో 5,500 కోళ్లు మృతి
- కాల్వల్లో కోళ్ల వ్యర్థాలు .. నీటి కలుషితంపై ప్రజల ఆందోళన

ఏలూరు/ఉంగుటూరు/ఏలూరు అర్బన్/ తణుకు రూరల్/యలమంచిలి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం బాదంపూడి వేంకట మణికంఠ పౌల్ట్రీస్‌లో బర్డ్ ఫ్లూ కారణంగా లక్షకుపైగా కోళ్ల మృత్యువాత పడడంతో వైరస్ మిగిలిన ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం నుంచి పది టీమ్‌లు ప్రత్యేక శానిటేషన్ పనులను చేయిస్తున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. పశుసంవర్థక, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో గ్రామంలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్, డీఎల్‌పీవో పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రాజ్‌మనోజ్ బర్డ్‌ఫ్లూ వ్యాపించిన పౌల్ట్రీని పరిశీలించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి ఎవరికైనా అనారోగ్యం ఉందా.. అంటూ ఆరా తీస్తూ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి మందులు అందిస్తున్నారు. స్థానికులు మాస్క్‌లు ధరించాలని సూచిస్తున్నారు. బాదంపూడి లంబాడీపేట, హైస్కూలు ప్రాంతాలను నిషేధిత ప్రాంతంగా ప్రకటించి బయటివారిని రావద్దని హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. ఉప్పాకపాడు, బాదంపూడి బైపాస్, చేబ్రోలు రైల్వే గేటు, ప్రకాశరావుపాలెం, వెల్లమిల్లి స్టేజ్, కాగుపాడు వంతెన, ఉంగుటూరు రైల్వే గేట్ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటుచేశారు. బాదంపూడి, వెల్లమిల్లి, చిన వెల్లమిల్లి, చింతాయిగూడెం, ఉప్పాకపాడు, బాదంపూడి, కాగుపాడు, బొమ్మిడి, ఉంగుటూరు, యర్రమళ్ళ, నాచుగుంట, నీలాద్రిపు రం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాలను సర్వే లైన్ గ్రామాలుగా ప్రకటించినట్టు తహసీల్దార్ తెలిపారు. అవసరమైన పక్షంలో డ్రోన్‌ల ద్వారా సోడి యం క్లోరైడ్ స్ప్రే చేయడంతోపాటు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని కాగుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మానస పేర్కొన్నారు. బాదంపూడిలో చనిపోయిన కోళ్లను పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో గోతుల్లో పూడ్చిపెట్టినట్టు వివరించారు.

బర్డ్ ఫ్లూపై అసత్య ప్రచారాలు నమ్మొద్దు : కలెక్టర్ వెట్రి సెల్వి



ఒక వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందంటూ సరైన నిర్ధారణ లేకుండా అసత్య ప్రచారాలను చేస్తూ ప్రజల్లో అలజడి సృష్టించవద్దని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'బాదంపూడి పౌల్ట్రీలో కోళ్లు చనిపోతున్నాయని ఫిర్యాదు అందగానే పశుసంవర్ధ శాఖ అధికారులను అప్రమత్తం చేశాం. మృతి చెందిన కోళ్ల నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపగా బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయ్యింది. వెంటనే జిల్లా అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేసి అప్రమత్తం చేశాం. బర్డ్ ఫ్లూ ఘటనలపై 99667 79943 టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన 24/7 కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. కోళ్లఫారాల్లో చనిపోయిన కోళ్లను పాతిపెట్టాలని ఆదేశించాం. ఎవరూ ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దు' అని తెలిపారు. పశుసంవర్ధ శాఖ జేడీ టి.గోవిందరాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌సతీష్ పాల్గొన్నారు. బాదంపూడిలో ఒక వ్యక్తి గొంతు క్యాన్సర్‌తో మృతి చెందగా.. దానిని బర్డ్ ఫ్లూ మరణమని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వదంతులు నమ్మవద్దని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు.



నరసాపురం పంట కాల్వలో చనిపోయిన కోళ్ల మూట

కాల్వల్లో మాంసం వ్యర్థాలు

నిడదవోలు-నరసాపురం ప్రధాన కాల్వలో వైరస్ కారణంగా చనిపోయిన కోళ్లను సంచుల్లో మూట కట్టి పారేస్తున్నారు. కాల్వలో నీరు కలుషితమై ప్రజారోగ్యం దెబ్బతింటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా చనిపోయిన కోళ్లను సంచుల్లో వేసి కాల్వలో వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. పాలకొల్లు బ్రాడీపేట వద్ద లారీ స్టాండ్ నుంచి యర్రవంతెన మధ్యలో ఈ విధమైన సంచులు మూడు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. కాల్వ పరివాహక ప్రాంతంలో ఉన్న చేపలు, చికెన్, మేక, గొర్రె మాంసం వ్యాపారులు అమ్మగా మిగిలిన వ్యర్థాలను కాల్వలో వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీటిపై దృష్టి సారించి కోళ్ల ఫారాల యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నరసాపురం పంట కాల్వల పరివాహక ప్రాంతం దిగువన పాలకొల్లు తర్వాత 70 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీరు గానూ ఉపయోగపడుతోంది, ఆయా గ్రామాల ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడరాదని రైతులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బాదంపూడిలో బర్డ్‌ఫ్లూ రెడ్‌జోన్ అంటూ ఏర్పాటు చేసిన బ్యానర్

31 పాఠశాలల్లో భోజనం గుడ్లు బంద్

బాదంపూడి నుంచి పది కిలోమీటర్ల పరిధిలోని 31 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లను వడ్డించవద్దని డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశించారు. మిగిలిన మండలాల్లోని పాఠశాలలకు కోడి గుడ్లు ఉయ్యూరు, ముసునూరుల్లోని పౌల్ట్రీల నుంచి సరఫరా అవుతున్నాయి. ఆయా పౌల్ట్రీల యజమానులు ఆ ప్రాంత పశుసంవర్ధక శాఖ వైద్యుడి నుంచి కోడి గుడ్లకు 'నో ఎఫెక్ట్' అని ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలన్నారు.

మేడపాడులో 5,500 కోళ్లు మృతి

యలమంచిలి మండలం మేడపాడు కడలి ఆంజనేయులు పౌల్ట్రీ ఫారంలో ఏడు వేల కోళ్లకు 5,500 చనిపోయాయని పశుసంవర్ధక శాఖ భీమవరం డీడీ జవార్ హుస్సేన్, పాలకొల్లు ఏడీ జి.మల్లేశ్వరరావు, మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గురువారం పౌల్ట్రీ ఫారంలో పరిస్థితిని పరిశీలించారు. ఏలూరు ల్యాబ్ నుంచి వచ్చిన నిపుణులు చనిపోయిన కోళ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు. వీటిని విజయవాడ, భోపాల్‌లోని ల్యాబ్‌లకు పంపిస్తామన్నారు. చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి, సున్నం వేసి పూడ్చిపెట్టారు.

ప్రజలకు వివరించండి : మంత్రి కొలుసు

కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ఏలూరు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. బర్డ్‌ఫ్లూ నియంత్రణకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారో జిల్లా అధికారులను మంత్రి గురువారం ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నియంత్రణకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించా లన్నారు. కోళ్ళకు వ్యాప్తి వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని, బర్డ్‌ఫ్లూ గుర్తించిన ప్రాంతాలలో వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల ఖననం : కలెక్టర్ నాగరాణి



బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేస్తున్నట్లు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం వేల్పూరులో ఈ వ్యాధి నిర్ధారణ జరిగిన కృష్ణానందం పౌల్ట్రీ ఫారంలో కోళ్ల ఖననం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ 'వేల్పూరులో వైరస్ సోకిన ఐదు కోళ్ల ఫారాల్లోని కోళ్లను పూడ్చిపెట్టే ప్రక్రియ ఆర్ఆర్‌టీ బృందాల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ ప్రక్రియ నిర్వహణకు పశువైద్యులు, సహాయ సిబ్బందితో మొత్తం 22 రాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేశాం. ఖననం ప్రక్రియ మొత్తం శాస్త్రీయ పద్ధతిలో సోడియం క్లోరైడ్, పొటాషియం పర్మాంగనేట్ వంటి రసాయనాలు వేసి పూడుస్తున్నాం. ఇక్కడ పౌల్ట్రీలో 20 వేల కోళ్లు ఉన్నాయి. ఈ కోళ్ల పూడ్చివేత పూర్తికాగానే ఫారాల షెడ్లలో మిగిలిన కోళ్ల అవశేషాలను ఫైర్ గన్స్ ద్వారా శుభ్రం చేయిస్తాం' అని కలెక్టర్ తెలిపారు. బర్డ్‌ఫ్లూ వైరస్ సోకిన కోళ్ల ఫారాల నుంచి ఎల్లోజోన్‌గా ప్రకటించిన పది కిలోమీటర్లలోని గ్రామాల్లో చికెన్, కోళ్ల విక్రయాలను నిషేధించామని తెలిపారు. ఇతర ప్రాంతాల వారు గుడ్లను, చికెన్‌ను ఉడకబెట్టుకుని తినవచ్చని తెలిపారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్‌శాఖ రాష్ట్ర డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ

సారా తయారీదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి

- జిల్లా అధికారులకు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనలో భాగంగా సారా కాస్తున్న తయారీదారులను ఆ పనులు మాన్పించి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ సూచించారు. శ్రీరామనగర్‌లోని జిల్లా ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా నిర్మూలనకు ఇతర శాఖలైన రెవెన్యూ, పోలీస్‌శాఖల సహకారంతో ముందుకు సాగాలన్నారు. సారా వృత్తిగా సాగేవారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపేందుకు గొర్రెలు, ఇతర యూనిట్ల స్థాపనలో చొరవ చూపేందుకు వారిలో అవగాహన కల్పించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్లను కోరారు. సారా తయారీ నివారణపై త్వరలో నవోదయం-2 కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. నల్లబెల్లం విక్రయదారులతో సమావేశాలు నిర్వహించి ఆ బెల్లం ఇవ్వకుండా నిరోధించాలన్నారు. పాత ముద్దాయిలు, సారా తయారీ అనుమానితులపై హిస్టరీ షీట్లను తెరవాలని, బైండోవర్ చేసిన ముద్దాయిలు మరలా నేరాలు చేసి పట్టుబడితే ఫైన్ వేసి తహసీల్దార్ల సమక్షంలో కట్టించాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు పాండురంగారావు, అజయ్‌కుమార్, సీఐలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

రబీ ధాన్యం సేకరణకు ముందస్తు చర్యలు

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాబోవు 2024-25 రబీ పంట కాలంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ధాన్యం పండించిన రైతుల ఖచ్చిత వివరాలను పూర్తి పారదర్శకంగా పంట నమోదు చేసి, ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రబీ ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక అమలులో భాగంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, జిల్లా అగ్రిట్రేడ్ మార్కెటింగ్ అధికారి, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్, తూనికలు కొలతలు సహాయ కంట్రోలర్, జిల్లా సహకార అధికారి, ధాన్యం కొనుగోలు ఏజన్సీల జిల్లా అధికారులు, రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షులు, అధికారులతో సమీక్షించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలక్ష్మి, డీఎస్‌వో రాజు, డీసీవో శ్రీనివాస్, ఆర్డీవో మదాని, తదితరులు పాల్గొన్నారు.

సైకిలెక్కిన ఆళ్ల నాని

- సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సుదీర్ఘ కాలం పాటు ఏలూరు ఎమ్మెల్యేగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ళ నాని గురువారం తెలుగుదేశంలో చేరారు. ఇప్పటికే పలుమార్లు టీడీపీలో చేరేందుకు ముహూర్తాలు పెట్టుకున్నా చేరిక వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలోనే గురువారం ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నానిని సాదరంగా ఆహ్వానించి పసుపు కండువా కప్పారు. పార్టీకి నిబద్ధతతో పని చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, సీనియర్ నేత సుజయ కృష్ణ రంగారావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఘంటా ప్రసాదరావుతో పాటు నాని తనయుడు పాల్గొన్నారు. వైసీపీలో అత్యంత కీలకంగా, అంతకుముందు కాంగ్రెస్‌లోను నాని కీలక పాత్ర వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా, ఒకమారు ఎమ్మెల్సీగా, జగన్ జమానాలో ఉప ముఖ్యమంత్రి హోదాలో కొన సాగుతూ వైద్య ఆరోగ్య శాఖను నిర్వర్తించారు. ఏలూరు నియోజకవర్గంలో 2009 నుంచే ఆయన క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ఆది నుంచి వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఆయన టీడీపీలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శించి ఆ మేరకు అనుకున్నది సాధించగలగడం విశేషం.

నాని రాకతో..

వాస్తవానికి ఏలూరు నియోజకవర్గంలో వైసీపీ ఇప్పటికే ఖాళీ అయ్యింది. ఒకప్పుడు నానికి అత్యంత సన్నిహితులుగా ఉన్న వారంతా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఎంఆర్డీ బలరాం దంపతులు, బొద్దాని శ్రీనివాస్‌తో పాటు మేయర్ నూర్జహాన్ పెదబాబు, మరికొందరు కార్పొరేటర్లు ఎమ్మెల్యే బడేటి చంటికి మద్దతుగా టీడీపీలో చేరారు. వీరందరి దరిమిలా నాని టీడీపీలో చేరాలని భావించగా నియోజకవర్గ టీడీపీ శ్రేణులు వ్యతిరేకించి నిరసనలు తెలిపారు. తమ వ్యతిరేక కూటమిలో ఉన్న ఆళ్ళ నానిని పార్టీలో చేర్చుకోవడం స్థానిక ఎమ్మెల్యే చంటికి ఇష్టంలేక పోయినా అధిష్ఠానం బుజ్జగించడంతో ఆయనతో పాటు కేడర్ కాస్తా మెత్తబడ్డారు. అధిష్ఠానం ఆదేశాలను అమలు చేయక తప్పలేదు. ఈ క్రమంలోనే నానిని పార్టీలో చేర్చుకోవడమే కాకుండా ఏలూరు జిల్లా తెలుగుదేశం అధ్యక్ష పగ్గాలు అప్పగిస్తారంటూ ప్రచారం సాగింది. ఇపుడు నాని రాకతో ఏలూరు నియోజకవర్గ పార్టీ వ్యవహారాల్లో ఇక ముందు ఎలా సాగబోతున్నాయనేది ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యే చంటి, ఆళ్ళ నాని సయోధ్యగా ఒకటై వ్యవహరిస్తే తప్ప ఏలూరులో రాజకీయాలు నెరపడం అంత సులువైనదేమీ కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



ఆళ్ల నానికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మంత్రి కొలుసు పార్థసారథి

చింతమనేని, డ్రైవర్‌పై వైసీపీ వర్గీయుల దాడి

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, అనుచరులపై కేసు

దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వర్గీయుల మధ్య మరోసారి వివాదం నెలకొంది. కల్యాణ మండపం వద్ద అబ్బయ్య చౌదరి కారును అడ్డుపెట్టి ఆపై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని చింతమనేని డ్రైవర్ ఫిర్యాదు చేయడంతో ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను చింతమనేని కలిసి నియోజకవర్గంలో పరిస్థితులను వివరించారు.

7



ఏలూరులో ఎస్పీని కలిసి వస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

నేడు మావుళ్లమ్మ అఖండ అన్నసమారాధన



6

వాసవీ ధామ్‌లో తమిళనాడు భక్తుల కోలాహలం

సుందరగిరిపై వేడుకగా శ్రీపుష్పయాగోత్సవం

వనామి రొయ్యకు.. వైరస్

సీడ్ దశలోనే రైతులకు షాక్



వైరస్ సోకి చనిపోయిన రొయ్యలు

కలిదిండి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వనామి రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు సీడ్ దశలోనే షాక్ తగులుతోంది. సీడ్ వేసిన నెల రోజులకే వైరస్ సోకి చనిపోతున్నాయి. వంద కౌంటుకు రాకుండానే రొయ్యలు మృత్యువాత పడుతున్నాయని, పెట్టుబడులు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వైజాగ్, కాకినాడ, నెల్లూరు, చెన్నైతో పాటు స్థానికంగా హేచరీలు సుమారు 200 వరకు ఉన్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వం ఆధ్వర్యంలో సీడ్ ఉత్పత్తి పరిమితంగా సాగుతోంది. కొనుగోలు చేసిన సీడ్ ల్యాబ్‌లలో పరీక్షించినప్పుడు ఎటువంటి వైరస్ ఉన్నట్టు తేలలేదని కానీ చెరువులో వేసే సరికి చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.

35 పైసలు పెరిగిన పిల్ల ధర

రొయ్య పిల్ల ధర అమాంతంగా హేచరీలో 35 పైసలకు పెంచారు. మొన్నటి వరకు 25 పైసలు ఉండేది. ఎకరానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు రొయ్యల పిల్లలను వదులుతారు. పెరిగిన ధరతో సీడ్ కొనుగోలు చేసి చెరువులో వేసి నెల రోజులు గడిచే సరికి వైరస్‌తో మృత్యువాత పడుతుండడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ప్రైవేట్ హేచరీలపై ఆధార పడడం వల్లే వైరస్ సీడ్ కొనుగోలు చేసి నష్టపోతున్నామని ప్రభుత్వమే హేచరీలను ఏర్పాటు చేసి నాణ్యమైన సీడ్‌ను ఉత్పత్తి చేయాలని రైతులు కోరుతున్నారు. 'రొయ్య పిల్లను వేసే ముందు చెరువులో గుణగణాలను పరీక్షించి తెలుసుకోవాలి. చెరువులో ఒక అడుగు నీరు నిండిన తర్వాత ప్లవకాలు వృద్ధి చెందేలా దృష్టి పెట్టాలి. సీడ్ వేసే సమయంలో మూడు అడుగుల మేర అమోనియా, నైట్రేట్ వంటి అన్ని పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడే చెరువులో వైరస్ వ్యాప్తి చెందకుండా రక్షించుకోవచ్చ'ని మత్స్యశాఖాభివృద్ధి అధికారి, రవికుమార్ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తెప్పోత్సవం



అంతర్వేది, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం స్వామివారికి పుష్పక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆలయ ఉత్తర ఈశాన్యంలో ఏర్పాటుచేసిన చెరువు వద్దకు తీసుకువచ్చారు. అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై తెప్పోత్సవాన్ని విద్యుత్ కాంతుల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు గోవింద నృసింహ నామాలతో జేజేలు పలుకుతూ తెప్పోత్సవం తిలకించి తరించారు.కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన స్వామివారి శ్రీపు ష్పోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. చెంగోల విన్నపం, తీర్థగోష్టి, అనంతరం స్వామివారి పవళింపు సేవతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.



అన్న సమారాధన ఏర్పాట్లు..కూరలు తరుగుతున్న భక్తులు

నేడు మావుళ్లమ్మ అఖండ అన్నసమారాధన



భీమవరం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి) : నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన 61వ మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాల సందర్భంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఎదుట మహాకుంభ నివేదన పూర్తయిన తర్వాత అఖండ అన్నసమారాధన ప్రారంభం కానుంది. కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు ప్రాంతాల్లో అమ్మవారి అన్న ప్రసాదం భక్తులకు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం దగ్గర నుంచి క్యూలైన్ ద్వారా లోపలికి వచ్చేందుకు ఇప్పటికే బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయానికి అటువైపున ఉన్న రోడ్లను మూసివేశారు. డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అమ్మవారి ప్రసాదం స్వీకరించిన భక్తులు బయటకు వెళ్లేందుకు పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి మార్గం ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నుంచే వంటలు ప్రారంభించారు. గురువారం అమ్మవారిని మహాలక్ష్మీ దేవిగా అలంకారం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



పాల పొంగళ్లను వండుతున్న భక్తులు

వేడుకగా శ్రీపుష్పయాగోత్సవం

సుందరగిరిపై నరసింహుని కల్యాణ ఉత్సవాలు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై కొలువైన లక్ష్మీనారసింహుని కల్యాణ మహోత్సవాలు గురువారం రాత్రి జరిగిన శ్రీపుష్పయాగోత్సవంతో ముగిశాయి. పాంచాహ్నిక దీక్షతో భీష్మఏకాదశి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను ఆరు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పాల పొంగళ్లను స్వయంగా కొండపై వండి స్వామివారికి నివేదించారు. రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు అనం తరం పవళింపు సేవ (శ్రీపుష్పయాగోత్సవం) వేడుకగా జరిపారు.



తమిళనాడు నుంచి వచ్చిన భక్తులతో నిండిపోయిన 102 రుషీ గోత్ర మందిరం

వాసవీ ధామ్‌లో తమిళనాడు భక్తుల కోలాహలం



పెనుగొండ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ వాసవీ శాంతి ధామ్ గురువారం తమిళనాడు సేలం నుంచి వచ్చిన వాసవీ భక్తులతో కోలాహలంగా మారింది. తమిళనాడు సేలం నుంచి ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సుమారు 1000 మంది వాసవీ భక్తులు ప్రత్యేక రైలులో తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు పెనుగొండ క్షేత్రం పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ ఆశీస్సులతో ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో గోపూజ, మహా చండీ హోమం నిర్వహించారు. తమిళనాడు ఆచారాలతో తంబతి పూజ నిర్వహించారు. మహాసభ ఛైర్మన్ శ్రీనివాసన్, కార్యదర్శి సురేంద్రన్, కోశాధికారి మురుగన్, పీఆర్‌వో జె.ప్రభాకరన్ పాల్గొన్నారు.



గాలాయగూడెంలో భారీ అన్న సమారాధన

దెందులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంతాన లక్ష్మిగా పేరు పొందిన గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. 9 రోజులుగా నవ అవతరాలలో దర్శనమిచ్చిన అచ్చమ్మతల్లికి తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు రెండువేల మంది వడ్డనలో పాల్గొనగా సుమారు 50 వేల మంది అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రేమైక జీవనం



ప్రేమ... ప్రణయం... రెండు పదాలు వేరువేరు కావచ్చు.. పేద, ధనిక, కుల, మత వర్గాలు ఏవైనా ప్రేమస్వభావం ఒక్కటే.. సృష్టిలో ప్రతి జీవికి, ప్రేమ ఆప్యాయతలు ఉన్నప్పటికీ కేవలం మానవులకు మాత్రమే వ్యక్త పరచడానికి మనసు, మాట ఉన్నాయి. ప్రేమ అనేది ఒక అనిర్వచనీయమైన భావన... చివరి మజిలీ అంటూ లేని ప్రయాణం. ప్రేమ అంటే కేవలం ఇవ్వడమే కాదు. పొందడం కూడా.. నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...



పాలకొల్లు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): క్రీస్తుపూర్వం 270లో రోమ్ దేశంలో జీవించిన వాలంటైన్ అనే యువకుడు యువతకు ప్రేమ సందేశాలు ఇవ్వడం... ప్రేమ వివాహా లను ప్రోత్సహించడం చేస్తూండేవాడు. ఆ సమయంలో రోమును పాలిస్తున్న చక్రవర్తి క్లాడియస్ కుమార్తె వాలంటైన్ అభిమానిగా మారడంతో చక్రవర్తికి భయం పట్టుకుని యువతను తప్పు దోవ పట్టిస్తున్నాడనే నెపంతో వాలెంటైన్‌కు మరణ శిక్ష విధించి ఫిబ్రవరి 14న ఉరి తీయిం చాడు. ఇది జరిగిన 2 దశాబ్దాల తరువాత అప్పటి పోప్ గెలాసియస్స్ వాలంటైన్ మరణించిన రోజును ప్రేమికుల రోజుగా ప్రకటిం చాడు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవంగా జరుపు కుంటున్నారు. పాత్యాశ్చ దేశాలలో ప్రేమికుల రోజును పూర్తి స్థాయిలో స్వాగతిస్తున్నప్పటికీ మన దేశంలో దక్షిణాది కన్నా, ఉత్తరాదిలో ప్రేమికుల అధికంగా వ్యతిరేకిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడైంది.

వివిధ ప్రాంతాల్లో వ్యతిరేకత

ఉత్తర ప్రదేశ్‌లో 2012 నుంచి ఫిబ్రవరి 14న మాతృ- పితృ పూజోత్సవంగా జరుపుతున్నారు. యూపి పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.మహారాష్ట్రలో బ్లాక్‌డేగా నిర్వహిస్తూ స్వాతంత్ర్య సిద్ధికి శ్రమించిన భగత్ సింగ్ తదితరులకు నివాళులర్పిస్తున్నారు. పలు ఉత్తరాది రాష్ట్రాలలో భజరంగ్ దళ్ కార్యకర్తలు ప్రేమికుల రోజున ఎవరైనా ప్రేమ జంటలు బహిరంగంగా కనిపిస్తే వారికి అక్కడికక్కడే పెళ్ళి చేసేస్తున్నారు.

దేశాన్ని ప్రేమించండి

ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజు కానే కాదు... యువతలో విపరీత పోకడలు పెరగడానికి ప్రేమికుల రోజు పేరుతో జరిగే విదేశీ, పాశ్చాత్య అనుకరణలే కారణం. మనదికాని సంస్కృతిని మనం తలకెక్కించుకోవడం తప్పు. మన దేశం కోసం, భవిష్యత్ కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకోవడం అసలైన ప్రేమ. పాకిస్తాన్‌లో జరిపిన కాల్పుల్లో బలిదానం అయిన 40 మంది వీర జవాన్లకు నివాళి అర్పించడం దేశ ప్రేమ... దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ లాంటి వారిని తలచుకోవడం ప్రేమ.. భర్తలకు వీర తిలకం దిద్ది దేశం కోసం యుద్ధ రంగానికి పంపి పసుపుతాళ్ళు తెగిన మాతృమూర్తులను తలచు కోవడం దేశ ప్రేమ, ప్రపంచానికే విశ్వ గురు వుగా వెలుగొందిన భారత దేశాన్ని ప్రేమించడం అసలైన ప్రేమ.. సమాజాన్ని సంస్కార వంతంగా నడిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది

- సునీతాదేవి, వీహెచ్‌పీ రాష్ట్ర మహిళా ప్రముఖ్, పాలకొల్లు



కెరీర్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి

నేటి యువత కేవలం ఆకర్షణనే ప్రేమగా భావిస్తూ భవిష్యత్తును పాడుచేసుకుంటు న్నారు. 2007 ఆగస్టు 23న సౌజన్యతో వివాహం అయ్యింది. 18 ఏళ్ల వైవాహిక జీవితంలో ఎంతో అన్యోన్యంగా ఉన్నాం. ప్రేమించే పెళ్లి చేసు కోవాల్సిన అవసరం లేదు..పెళ్లి పెళ్లి చేసుకున్న తరువాత ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ ప్రేమా నుబంధా లతో జీవనం సాగించవచ్చు యువత కెరీర్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి.. తర్వాతనే ప్రేమ... ప్రేమించినప్పటికీ జీవితానిచ్చిన తల్లి దండ్రుల అనుమతితోనే పెళ్లికి సిద్ధపడాలి.. భార్య సౌజన్య భీమవరం జూనియర్ కళా శాలలో గణిత అధ్యాపకురాలిగా పని చేస్తున్నది. మా అబ్బాయి సిద్ధార్థ ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువు తున్నాడు. హ్యాపీగా ఉన్నాం..

-నరసాపురం ఆర్డీవో దాసి రాజు

అబ్బాయికి 17.. అమ్మాయికి 16..



తెలిసీ తెలియని వయసు.. అబ్బాయికి 17, అమ్మాయికి 16.. వారిద్దరి మధ్య ప్రేమ ఫలించింది. పెద్దలు అంగీకరించారు.. అంతే కాకుండా మేనరికం..ఇంకే ముంది.. ఉభయుల పెద్దల అంగీ కారంతో వివాహం జరిగింది. ఆచంట గ్రామానికి చెందిన మండెల శ్రీనివాసరావు, అలివేలు మంగ తాయార్ల ప్రేమ కథ ఇది 1990లో మేనమామ కుమార్తె అలివేలు మంగతాయారుతో శ్రీనివాస్ ప్రేమలో పడ్డారు. 1990 జూన్ 22న వివాహం కాగా 35 ఏళ్ళుగా వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగుతోంది. కొడుకూ, కోడలు, కూతురు అల్లుడు, ముగ్గురు మనుమలతో మా కుటుంబం సంతోషంగా ఉందని శ్రీనివాస్ తెలిపారు. నేటి యువత ఆకర్షణనే ప్రేమగా భావిస్తున్నారని పరస్పర అవగాహనతోనే వివాహం వరకూ వెళ్లాలన్నారు.



లక్ష్మీపురంలో పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాదం అందిస్తున్న కొల్లూరి రాంబాబు

రామభక్తుల పాదయాత్ర

జీలుగుమిల్లి, జనవరి, 13 : (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం కాకినాడ నుంచి భద్రాచలం శ్రీరాముని రథోత్సవంతో వాసుదేవగురు స్వామితో కలసి 250 మంది శ్రీరామ భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. మార్గ మధ్యలో లక్ష్మీపురం వద్ద గ్రామ పెద్దలు కొల్లూరి రాంబాబు భార్య పద్మావతి జ్ఞాపకార్థం అన్న ప్రసాదాలు భక్తులకు వితరణ చేశారు. అనంతరం వారి విశ్రాంతికి తగిన ఏర్పాట్లు చేశారు. 14 సంవత్సరాలుగా ప్రజల్లో ధార్మిక చైతన్యం కోసం పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు గురుస్వామి చెప్పారు. 17 తేదీ నాటికి భద్రాచలం చేరుకుంటామన్నారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముగిసిన బధిరుల రాష్ట్రస్థాయి టి-20 క్రికెట్ పోటీలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) బధిరులు అన్ని రంగాల్లో ముందంజులో ఉంటున్నారనేందుకు బధిరుల రాష్ట్ర స్థాయి టి-20 క్రికెట్ పోటీలు నిరూపిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ మినిస్టీరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డఫ్ అండ్ డమ్ (మూగ, చెవిటి) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి 5వ టీ-20 క్రికెట్ పోటీల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సభ్యులు కూనపరాజు రామకృష్ణంరాజు, కంతేటి వెంకట్రాజు, నందమూరి రాజేష్, అల్లూరి సూర్యనారాయణరాజు, చెరుకువాడ రంగసాయి, పులపర్తి శ్రీను విజేతలకు బహుమతులు అందించారు. విజేతలుగా గుంటూరు జోన్ (ప్రకాశం, గుంటూరు, నెల్లూరు) ప్రథమ స్థానంలో నిలవగా జోన్-1 (శ్రీకాకుళం, విశాఖపట్నం) ద్వితీయస్థానం సాధించాయి. భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, తాతారావు, విశాఖపట్నం ఈస్ట్ ఎమ్మెల్యే రామకృష్ణబాబు, కారడి రాజు, కామేశ్వరీ,తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెపుడో ?

ప్రభుత్వ కార్యాలయాలు వసతి లేక అల్లాడుతున్నాయి.. కొన్నిటికి భవనాలు ఉన్నా అద్దె భవనాల్లో వెళ్లదీస్తుంటే కొన్ని నిర్మాణాలు పూర్తవక వేరే కార్యాలయాల్లో కాలక్షేపం చేస్తున్నాయి. కొన్ని ఉన్నా నిరుపయోగంగా మారాయి..



పైడిపర్రు పంచాయతీ భవనంలో కొనసాగుతున్న తణుకు రూరల్ పోలీస్ స్టేషన్

తణుకులో పోలీస్ స్టేషన్లకు సొంత భవనాల కరువు

తణుకు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తణుకులో శాంతి భద్రతలు కాపాడే పోలీస్ విభాగాలకు సొంత భవనాలు కరువయ్యాయి. తణుకు సర్కిల్‌లోని అన్ని మండలాల పోలీస్ స్టేషన్‌లకు సొంత భవనాలు ఉన్నప్పటికీ తణుకు పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లు మాత్రం అద్దె భవనాలు, లేక ఇతర శాఖలకు చెందిన భవనాల్లో కొనసాగుతున్నాయి. మొదటి నుంచి తణుకు కోర్టు ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ భవనాలతో పాటు పోలీస్‌స్టేషన్ కూడా వుండేది. అప్పట్లో పట్టణ, రూరల్ విభాగాలు లేకపోవడంతో అన్నీ ఒకే చోట వుండేవి. తర్వాత పట్టణ స్టేషన్, రూరల్‌స్టేషన్‌లు విడివిడిగా ప్రైవేట్ భవనాలలో వుండేవి. కోర్టు ప్రాంగణంలోనే పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక భవనం నిర్మించారు. అందులో పట్టణ, రూరల్ స్టేషన్‌లతో పాటు సీసీ కెమెరాల రూం, కంట్రోల్ రూంలుగా పనిచేసేవి. ఇటీవల కోర్టు ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారి తాకిడి పెరిగిపోవడంతో ఇక్కడ పోలీస్ స్టేషన్‌లను వేరే ప్రాంతాలకు తరలించారు. దీనితో ఆ భవనం నిరుపయోగంగా మిగిలిపోయింది. తణుకు రూరల్ స్టేషన్ పైడిపర్రుకు, పట్టణ స్టేషన్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గల రెవెన్యూ భవన్‌కు మార్చారు. తణుకు రూరల్ స్టేషన్ భవనం కొంత కాలం ప్రైవేట్ భవనంలో కొనసాగేది. అయితే 2013 సంవత్సరంలో పైడిపర్రు గ్రామం తణుకు మున్సిపాలిటీలో విలీనం కావడంతో పైడిపర్రు పంచాయతీ కార్యాలయ భవనాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌గా మార్చారు. పట్టణంలోని పోలీస్ కంట్రోల్ రూం వద్ద సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన రూములో ఇప్పుడు పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌గా కొనసాగుతుంది. ఒకప్పటి తణుకు సర్కిల్ పరిధిలోని ఉండ్రాజ వరం, పెరవలి, అత్తిలి, ఇరగవరం పోలీస్‌స్టేషన్‌లకు సొంత భవనాలు ఏర్పడినప్పటికీ తణుకులోని పోలీస్ స్టేషన్‌లకు మాత్రం సొంత భవనాలు ఏర్పడలేదు. అందుబాటులో వున్న అద్దె, ప్రభుత్వ భవనాలను పోలీసు స్టేషన్‌లుగా మార్చుకున్నారు. వీటిలో కొన్ని వాస్తు దోషాలున్నాయనే అపోహలతో సిబ్బంది మథన పడుతున్నారు.



రెవెన్యూ భవన్‌లో కొనసాగుతున్న తణుకు పట్టణ పోలీస్ స్టేషన్

ఇండోర్ స్టేడియం పూర్తయ్యేనా ?

ఎనిమిదేళ్లుగా మధ్యలో నిలిచిపోయిన పనులు



మొగల్తూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో క్రీడా వికాసానికి గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. 2017లో టీడీపీ హయాంలో ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇండోర్ స్టేడియం మంజూరు చేసింది. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న బండారు మాధవనాయుడు రూ.2 కోట్లు వ్యయంతో నిర్మించే ఈ స్టేడియంను మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించేందుకు నాటి క్రీడల మంత్రి కొల్లు రవీంద్రతో శంకుస్థాపన చేయించారు. నిర్మాణం స్లాబ్ దశకు చేరిన అనంతరం ఎన్నికల షెడ్యూల్ రావడంతో నిలిపివేశారు. గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు చేపట్టారు. వాకింగ్ ట్రాక్, షటిల్, వాలీబాల్ కోర్టులు నిర్మాణానికి నోచుకోలేదు. ఇండోర్ స్టేడియం నిర్మాణం ఇలా మధ్యలో నిలిచిపోవడంతో క్రీడాకారులు, యువకులు, క్రీడాభిమానులు నిరుత్సాహానికి లోనవుతున్నారు. కూటమి పాలనలో స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేసి తీరగ్రామాల క్రీడాకారుల కల సాకారం చేయాలని లేకుంటే ఇప్పటి వరకూ చేసిన ఖర్చు వృథానే అని అంటున్నారు.



మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులు

ఇరిగేషన్ నీడలో రెవెన్యూ సేవలు

పెనుమంట్ర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి సొంత భవనం లేక రెవెన్యూ శాఖ ఇరిగేషన్ అతిథి గృహాన్ని కార్యాలయంగా మార్చుకుని సేవలందించారు. బ్రిటిష్ కాలం నాటి ఇరిగేషన్ అతిథి గృహం శిథిలావస్థకు చేరడంతో తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పితాని సత్యనారాయణ నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి రూ.90 లక్షలు వ్యయంతో పనులు ప్రారంభించారు. 2018లో ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులు ప్రారంభించారు. బేస్మెంట్ లెవెల్ పూర్తికాగానే ప్రభుత్వం మారడంతో పనులను నిలిచిపోయాయి. పిచ్చి మొక్కలు చెత్తాచెదారం పేరుకుపోయి పిల్లర్స్ వేసేందుకు కట్టిన ఇనుప ఊచలు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. ఇటీవల పెనుమంట్ర మండలానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి తహసీల్దార్ రవికుమార్ తీసుకువెళ్లారు. దీంతో దీనికి సంబంధించి ఫైల్ పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాలకులు, అధికారులు చొరవతో పనులు ప్రారంభమవుతాయని భావిస్తున్నారు.

నిరుపయోగంగా మండల పరిషత్ అతిథిగృహం

గణపవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గణపవరం నడిబొడ్డున ఉన్న మండల పరిషత్ అతిథిగృహం నిరుపయోగంగా తయారైంది. ఈ అతిథి గృహం అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు విడిది చేసేలా ఆధునిక సదుపాయాలతో పునఃనిర్మించారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి గణపవరంలోని పలు కార్యక్రమాలు, శంకుస్థాపనలకు వచ్చి నప్పుడు ఈ అతిథిగృహంలో బసచేసేలా ఏసీలు, విశాలమైన పడకగదులు, నూతన సోఫాసెట్లు, అధునాతనంగా తీర్చిదిద్దారు. దీన్ని పునరుద్ధరించేందుకు అప్పట్లో ప్రభుత్వ నిధులు వెచ్చించారు. భోజనానికి, బ్రేక్‌ఫాస్ట్‌కు అనువుగా ఉండేలా అత్యాధునిక టేబుల్స్ ఏర్పాటు చేశారు. తదనంతరం దీని నిర్వహణ అధికారులు పట్టించుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ వ్యవస్థ రావడంతో అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. సచివాలయాలకు పక్కా భవనాలు నిర్మించడంతో అతిథి గృహం మూతపడింది. శుభ్రం చేసే దిక్కులేకుండా పోవడంతో పిచ్చిమొక్కలు చెత్తా, చెదారంతో నిండిపోయింది. దీనిపై గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అతిథిగృహం ప్రాంగణాన్ని, భవనాన్ని పరిశుభ్రం చేయి స్తామని పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గణపవరం సెంటర్‌లో నిరుపయోగంగా ఉన్న మండల పరిషత్ అతిథి గృహం




అడ్డుగా ఉన్న కారు తీయాలని అభ్యర్థిస్తున్న చింతమనేని గన్‌మెన్, దాడిపై పోలీసులకు డ్రైవర్ ఫిర్యాదు

చింతమనేని, డ్రైవర్‌పై వైసీపీ వర్గీయుల దాడి

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, అనుచరులపై కేసు

పెదవేగి/ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అనుచరులు దాడి చేశారంటూ కేసు నమోదైంది. వివరాలివి.. ఎమ్మెల్యే చింతమనేని వద్ద ఏలూరు కండ్రికగూడెంకు చెందిన మానుకొండ సుధీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 9.30 గంటల సమీపంలో వట్లూరు - సీతారామపురం రోడ్డులో పద్మావతి కన్వెన్షన్ హాలులో ఒక వివాహానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. డ్రైవర్ కారు వద్ద ఉన్నారు. ఇంతలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌చార్జి కొఠారు, ఆయన అనుచరులు కలిసి కారు అడ్డుపెట్టి డ్రైవర్‌పై దాడి చేశారు. ప్రశ్నించిన డ్రైవర్‌ను కులంపేరుతో దూషించి కొట్టారు. కొఠారు, ఆయన అనుచరులు చంపడానికి ప్రయత్నించారని డ్రైవర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పుడే వచ్చిన ఎమ్మెల్యే ప్రభాకర్‌పైన దాడికి ప్రయత్నించారని అడ్డుకోబోయిన గన్‌మెన్ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్) వద్ద ఉన్న గన్ తీసుకుని కాల్చడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రధాన నిందితుడిగా అబ్బయ్య చౌదరి, వేమూరి జితేంద్ర, జానంపేట బాబు, విజయ్‌బాబు, మట్టా ప్రవీణ్, పామర్తి వీర్రాజు, ఉప్పలపాటి సాయిరామ్‌చౌదరి, చల్లారి హేమంత్, పొన్నూరి నాగరాజు మరికొందరు దాడిలో పాల్గొన్నారని పేర్కొనడంతో వారందరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

దాడి విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులు దుగ్గిరాలలోని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటికి భారీగా చేరుకున్నారు. వైసీపీ వర్గీయులు కొఠారు అబ్బయ్యచౌదరి స్వగ్రామం కొండలరావుపాలెం చేరుకున్నారు. పోలీసులు ఈ గ్రామాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, వివాదం పెరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఉద్దేశ పూర్వక దాడి : చింతమనేని



శుభకార్యం వద్ద కారు అడ్డుపెట్టి గొడవ పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే చింతమనేని మండిపడ్డారు. గురువారం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివాహ వేడుక వద్ద అబ్బయ్య చౌదరి కారు అడ్డుపెట్టారని, అక్కడ ఉన్న సెక్యూరిటీ చెప్పినా కారు తీయకుండా ఉద్దేశ పూర్వకంగానే గొడవ పెట్టుకుని తన డ్రైవర్‌పై, తన గన్‌మెన్‌పై దాడికి దిగారని చెప్పారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని ప్రవర్తిస్తున్నారని తప్పు చేసిన వారు ఈ రోజు కాకపోయినా రేపైనా శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు. తప్పు చేసిన వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పరిణామాలు వేరేగా ఉంటాయని హెచ్చరించారు.

కక్ష సాధింపు చర్యలు : కొఠారు



ఎమ్మెల్యే చింతమనేని తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొఠారు ఆరోపించారు. పెళ్లి వేడుక ఘటనపై గురువారం ఏలూరులో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఇది రెడ్ బుక్ రాజ్యాంగమా, టీడీపీ రాజ్యాంగ మా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదని, ఇకనైనా చింతమనేని తన ప్రవర్తనను మార్చుకోవాలని చెప్పారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 35 మంది


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు సునీత

- మొత్తం నామినేషన్లు 54
- పరిశీలనలో 11 తిరస్కరణ
- ఉపసంహరణ 8

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

పట్టభద్ర ఓటర్లు 3,14,984

పోలింగ్ కేంద్రాలు 456

తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు (ప్రస్తుత) ఆరు జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 3,14,984 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పురుష ఓటర్లు 1,83,347 మంది కాగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది ఉన్నారు. మొత్తం 19 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

ఏలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 35 మంది పోటీలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన గురువారం సాయంత్రం నాటికి 8 మంది పోటీ నుంచి తప్పుకున్నారు. మొత్తం 54 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, 11 మంది నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. మరో 8 మంది పోటీ నుంచి నిష్క్రమించారు. నామినేషన్ల మొత్తం ప్రక్రియ ముగియడంతో ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

పేరాబత్తుల రాజశేఖరం(కూటమి అభ్యర్థి), కాట్రు నాగబాబు, షేక్ హుసేన్, కట్టా వేణు గోపాలకృష్ణ, కాండ్రేగుల నరసింహం, కాళ్లూరి కృష్ణమోహన్, కుక్కల గోవిందరాజు, కునుకు హేమాకుమారి, క్రైలా లావణ్య, గౌతంబాబు కొల్లు, చిక్కాల దుర్గారావు, తాళ్లూరి రమేష్, దత్తాత్రేయ నోరి, దిడ్ల వీర రాఘవులు(పీడీఎఫ్), దొరబాబు యాళ్ల, నీతిపూడి సత్యనారాయణ, పినిపే నాగభూషణశర్మ, పిప్పళ్ల సుప్రజ, పేపకాయల రాజేంద్ర, బొడ్డు శ్రీనివాసరావు, బొమ్మన బోయిన వీఎస్ఆర్ మూర్తి, బొమ్మిడి సన్నిరాజ్, బండారు రామ్మోహన్‌రావు, బీమేశ్వరరావు చిక్కా, మాకే దేవిప్రసాద్, మెర్ల శాస్త్రులు, మోకన అంబేద్కర్, రాజ పూడి, జేటీ.రామారావు, రేవులగడ్డ ముఖేష్‌బాబు, వానపల్లి శివగణేష్, ఎం శ్రీనివాసరావు, శ్రీనివాస్ విష్ణువజ్జుల, జీవీ సుందర్, హసన్ షరీఫ్ బరిలో నిలిచారు.

ఉపసంహరణ అభ్యర్థులు..

గద్దె విజయలక్ష్మి, డాక్టర్ కవల నాగేశ్వరావు, పచ్చిగోళ్ల దుర్గారావు, పేరాబత్తుల సత్యవాణి, బాలాజీ గుండుమోలు, పిళ్లంగోళ్ల లీలా నగేష్, సత్తిరాజు స్వామి, చక్రపాణి.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఆర్వో వెట్రిసెల్వి

జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సమక్షంలో పోటీలో నిలిచిన అభ్యర్థులతో వెట్రిసెల్వి గురువారం సమావేశం నిర్వహించారు. టీవీ, ఇతర సోషల్ మీడియా ప్రచార కోసం మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వివరించారు. ఏమైనా సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1950కు సంప్రదించాలన్నారు. ఏఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

ఎన్నికల పరిశీలకురాలు సునీత

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి పాటించాలని, అమలుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు 70 జోన్లు ఏర్పాటు చేసి, జోనల్ అధికారులను నియమించామని, 95 మంది రూట్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారన్నారు. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి అధికారులు అవసరమైన శిక్షణ అందించాలని సునీత సూచించారు. పటిష్ఠ బందోబస్తుతో ఏలూరులో కౌంటింగ్ జరుగుతుందని, ఇక్కడే స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లకు మొదట విడత శిక్షణ పూర్తి చేశామన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఏలూరు నుంచి ఏఆర్వో వి.విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందిందా..?

41.15 కాంటూరు లెవెల్ గ్రామాల్లో ప్రారంభమైన సర్వే


కుక్కునూరులో నిర్వాసితుల ఇళ్లలో సర్వే చేస్తున్న అధికారులు


విజయవాడలో మంత్రి నిమ్మలకు సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

కుక్కునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపుబారిన పడుతున్న గ్రామాలను ఖాళీ చేయించడానికి అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. తొలి దశలో కుక్కునూరు మండలంలో 8గ్రామాలు, వేలేరుపాడు మండలంలోని 17గ్రామాలకు వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్లకు పరిహారం, పునరావాస కాలనీలో ఇళ్ల కేటాయించడం, ఇల్లు వద్దనుకున్న వారికి స్థలం కేటాయించడం, ఇల్లు, స్థలం రెండు వద్దనుకున్న వారికి రూ.385 వేలు సొమ్ము జమ చేయడం, 2017 కట్ ఆఫ్ తేదీ ప్రకారం 18 ఏళ్లు నిండిన యువతకు పునరావాస పరిహారం జమ చేయడం, భూములకు పరిహారం చెల్లించడం జరిగింది.

కొంత మందికి బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, ఇతరేతర కారణాల వలన పూర్తి స్థాయిలో ఏదొక పరిహారం పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో 41.15కాంటూరు లెవెల్ గ్రామాల్లో నిర్వాసితుల సమస్యలను పూర్తిస్థాయిలో తొలగించడానికి ప్రభుత్వ యంత్రాంగం దృష్టి పెట్టింది. ఏ పరిహారం పెండింగులో ఉందో తెలుసుకోడానికి సర్వే చేపట్టారు. కుక్కునూరు ఏ బ్లాక్‌లో రెవెన్యూ సిబ్బంది గురువారం నిర్వాసితుల ఇంటికి వెళ్లి వారికి ఏ పరిహారం పెండింగ్ ఉందో నమోదు చేసుకుంటున్నారు. 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న అన్ని గ్రామాల్లో సర్వే చేయనున్నారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెంలో గిరిజనేతర నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ళ ప్లాట్లు వాటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ సర్వే ప్రక్రియ పూర్తయితే ఎవరెవరికి ఏసమస్య పెండింగ్ ఉందో తేలనుంది.

ఈ ఏడాది జనవరిలో కుక్కునూరు, వేలేరుపాడు మండాలంలోని నిర్వాసితులకు దాదాపు రూ.850కోట్లు పరిహారం నిర్వాసితుల ఖాతాలో జమ చేసింది. అయినప్పటికి మాకు పరిహారం పెండింగ్‌లో ఉందంటూ నిర్వాసితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రామసభలు కూడా నిర్వహించారు. వేలాది దరఖాస్తులు రావడం జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇంటింటా సర్వేతో ఆ సమస్యను పూర్తి స్థాయిలో తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఉంది. ఈ సర్వే మొత్తం పూర్తయితే నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించడానికి ప్రభుత్వ యంత్రాంగం వేగంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. కుక్కునూరు వేలేరుపాడు మండలాల్లో 41.15కాంటూరు లెవెల్ 25 గ్రామాలకు సంబంధించి 7001 గిరిజన, గిరిజనేతర నిర్వాసితులు ఉన్నట్లు సమాచారం. రాబోయే వర్షాకాలం సీజన్‌నాటికి నిర్వాసితులను తరలించే ప్రక్రియ జరుగుతుందని ప్రచారం సాగుతోంది.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

మంత్రి నిమ్మలకు వినతి

వేలేరుపాడు, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రభుత్వ నిర్వాకం, అధికారుల అవినీతి కారణంగా పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగిందని గత తప్పిదాలను సరిచేసి నిర్వాసితులకు న్యాయం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్ కోరారు. టీడీపీ నాయకుల బృందం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును గురువారం విజయవాడలో కలిసి నిర్వాసితుల సమస్యలపై విన్నవించారు. నాన్‌లోకల్ కారణం గా కొందరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ జాబితా నుంచి తొలగించారని, చనిపోయిన వారి కుటుం బానికి ప్యాకేజీ చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం సుమారు 350 మందిని జాబితా నుంచి తొలగించారని, వారసులులేరని తప్పుడు నివేదిక ఇచ్చారని మంత్రికి తెలిపారు. టీడీపీ సానుభూతిపరులను 350 మందికి పైగా జాబితా నుంచి తొలగించారన్నారు. కూటమి ప్రభుత్వం గత నెల 3న నిర్వాసితుల ఖాతాలకు ఆర్ అండ్ ఆర్ పరిహారం ఖాతాలకు జమ చేసిందని కొన్ని సాంకేతిక కారణాల వలన సుమారు 650 కుటుంబాలకు అందలేదన్నారు. 18ఏళ్లు నిండిన వారి విషయంలో నిర్ణయించిన కట్‌ఆఫ్ డేట్‌ను సవరించి, తరలించే నాటికి 18ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ ఇప్పించాలని మంత్రిని కోరారు. ఏ ఒక్క నిర్వాసితునికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నిమ్మల హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో వాసిరెడ్డి జగన్, జాగర్లమూడి శ్రీకాంత్, చందా కనకారావు, తదితరులు ఉన్నారు.

బంగారం, నగదు చోరీ

పెంటపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమామహేశ్వరంలో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమామహేశ్వరం గ్రామంలోని సూర్యారావు తాడేపల్లిగూడెంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం బద్దలు కొట్టి రూ 84 వేలు విలువైన బంగారం, నగదు అపహరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇంటిని పరిశీలించిన ఎస్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగకు ఏడు నెలల జైలు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనం చేసిన కేసులో నిందితుడికి కోర్టు ఏడు నెలల జైలు శిక్ష విధించింది. పట్టణానికి చెందిన బోసు మోజేష్‌పై 2024లో మోటార్ సైకిల్ దొంగతనం కేసు నమోదైంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ మోజేష్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. సెకండ్ ఏజెఎఫ్‌సిఎం కోర్టు న్యాయాధికారి డి.ధనరాజ్ విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావటంతో ఏడు నెలల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌కు కానిస్టేబుల్ మురళి సహకరించారు.

మసాజ్ సెంటర్ నిర్వాహకులు ముగ్గురి అరెస్ట్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్యూటీపార్లర్, స్పా మసాజ్ సెంటర్ పేరుతో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐదుగురిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టారు. ఎన్ఆర్‌పేటలోని ఓవర్ బ్రిడ్జి కింద సింధు కాంప్లెక్స్, సెకండర్ ఫ్లోర్‌లో ఎస్ఎస్ బ్యూటీ యునిసెక్స్ బ్యూటీ పార్లర్ పేరుతో నిర్వహిస్తున్నారు. కొంతమంది యువతులకు బ్యూటీషియన్ కోర్సు నేర్పిస్తామంటూ మాయమాటలు చెప్పి వారితో వ్యభిచారం చేయిస్తున్నారు. క్రాస్ మసాజ్‌లు చేయిస్తున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఈనెల 11న రాత్రి టూటౌన్ సీఐ వైవి రమణ, సిబ్బంది దాడి చేశారు. అక్కడ కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చి నిర్వాహకులు నమ్మిన నాగార్జున, అతని భార్య నమ్మిన శివదుర్గ, ఉర్ల దివ్య, భాను ప్రకాష్, నరేంద్రపై కేసు నమోదు చేశారు. నాగార్జున, శివదుర్గ, దివ్యలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. పరారీలో ఉన్న భానుప్రకాష్, నరేంద్రను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కడియద్దలో విచారిస్తున్న సీసీఎల్ఏ సహాయ కమిషనర్ శ్రీనివాస్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ సదస్సుల్లో అర్జీల పరిష్కారంలో సంతృప్తి పొందని వారిని ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించామని, వారి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమరావతి సీసీఎల్ఏ అదనపు సహాయ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం కడియద్ద, జగన్నాధపురం, వీరంపాలెం, దండగర్ర సచివా లయాల్లో అసంతృప్త అర్జీదారుల దగ్గరకు వెళ్లి విచారించారు. దీనికి సంబంధించి నివేదిక ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈవోపీఆర్డీ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


నూజివీడు ఆర్జీయూకేటీలో వర్క్‌షాపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమరేంద్రకుమార్ తదితరులు

స్మార్ట్ టూల్స్‌పై మార్చి 3,4 తేదీల్లో వర్క్‌షాప్

నూజివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌టూల్స్, స్మార్టర్ డిజైన్స్‌పై మార్చి3,4 తేదీల్లో రెండు రోజుల పాటు జాతీయ వర్క్‌షాపు శ్రీకాకుళంలో నిర్వహించనున్నారు. నూజివీడు ఆర్జీయూకేటీ క్యాంపస్‌లోని శ్రీకాకుళం విభాగంలో గురువారం పోస్టర్స్ ఆవిష్కరించారు. ఆర్జీయూకేటీ ఏపీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, డీన్ శ్రావణి దువ్వూరి, ఈఐటిటి డీన్ టి.శ్యామ్, శ్రీకాకుళం డిప్యూటీ ఏవో ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ అధునాతన సివిల్ ఇంజినీరింగ్ సాధనాలు, సాంకేతికతపై వర్క్‌షాప్ దృష్టిసారిస్తుందని తెలిపారు. అధిక - కచ్చితత్వ సర్వేయింగ్ కోసం ఎల్ఐడిఏఆర్, డీజీపీఎస్ వాడకం, స్కెచెస్ ప్రో, ఆటోకాడ్ త్రీడి ఉపయోగించి, భవనప్రణాళిక, డిజైన్, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. నిపుణుల చర్చలు, ఆచరణాత్మక శిక్షణ ఉంటాయని తెలిపారు. సామర్థ్యం, ఆవిష్కరణలను పెంపొందించడానికి స్మార్ట్ సాధనాలను ఇంజినీరింగ్ పద్ధతుల్లోకి అనుసంధాన ప్రాముఖ్యతను వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఆర్జీయూకేటీ శ్రీకాకుళంలోని నిర్వాహక బృందాన్ని సంప్రదించవచ్చని వివరించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

యలమంచిలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నడిచివెళుతున్న మహిళను లారీ రూపంలో మృత్యువు కబళించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి యలమంచిలి ప్రధాన రహదారిపై తాడిగరువు తోటకు చెందిన తలపూరి విజయ(60) తన ఇంటికి నడుచుకుని వెళుతుంది. వెనుకనుంచి కొబ్బరిలోడు లారీ ఆమెను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె రెండుకాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. స్థానికులు ఆమెను 108లో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ముగ్గురు కుమార్తెలు వివాహం కావడంతో ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తుంది. నిరుపేద అయిన తలపూరి విజయ ఇళ్లలో పని చేసుకుని జీవనం సాగిస్తుంది. ఆమె మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలు జారి భవనంపై నుంచి పడడంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీకి చెం దిన భవన నిర్మాణ కార్మికుడు తొలేటి తులసీ భీమరాజు (38) కెనాల్ రోడ్డులో అయ్యప్ప స్వామి గుడి సమీపంలో భవన నిర్మాణ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. తక్షణమే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, గాయ పడిన భీమరాజును పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మంచు | ఎండ

చింతలపూడి చెక్‌పోస్టు సమీపంలో..



చలికాలం ముగియలేదు.. వేసవి ఆరంభం కాలేదు.. అందుకే రెండూ కాలధర్మం పాటిస్తున్నాయి. రాత్రి నుంచి ఉదయం వరకు చలి వణికిస్తుంది. మంచు ముసుగు కప్పేస్తుంది. పగలు భానుడు ప్రతాపం చూపడంతో ఉక్కపోతతో సతమతం కావాల్సిందే. ఏలూరు నగర శివారుల్లో గురువారం ఉదయం 8 గంటల వరకు మంచు ముసుగులోనే వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించారు. చొదిమెళ్ల సమీపంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద, జానంపేటలో రోడ్డును పొగమంచు కమ్మేసింది. మంచులోనే కూలీలు పనులు చేసుకున్నారు. ముసునూరు మండలం వలసపల్లి వద్ద రోడ్డు పక్కన సాలెగూడుపై మంచు కనువిందు చేసింది. సమయం పది గంటలు దాటుతుండగా భానుడి డ్యూటీ ఎక్కాడు. ఎండ చుర్రుమంది. అలా నూజివీడు ట్రిపుల్‌ఐటీ వైపు చూస్తే విద్యార్థులు ఎండ తీవ్రతకు గొడుగులు వేసుకున్నారు. కొందరు విద్యార్థులు చున్నీలే రక్షణగా కప్పుకున్నారు. -ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఏలూరు

పంట చేలల్లో మంచు దుప్పటి




విద్యార్థులకు ఎండ వేడిమి నుంచి గొడుగుల రక్షణ



విధుల్లోకి తీసుకోవాలని క్లాప్ ఆటో డ్రైవర్ల భిక్షాటన

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకుని బకాయి వేతనాలు చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య డిమాండ్ చేశారు. మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో పవర్ పేట రైల్వే స్టేషన్ నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ఆటోడ్రైవర్లు భిక్షాటన చేశారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ ఉద్యోగాలు తొలగించడమే కాకుండా ఊడునెలలుగా జీతాలు ఇవ్వకపోతే డ్రైవర్ల కుటుంబాల సంగతేంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో భిక్షాటన చేస్తూ డ్రైవర్లు నిరసన తెలిపారు.

స్వచ్ఛ హేలాపురి కోసం ప్రజలు సహకరించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి) :స్వచ్ఛహేలాపురి కోసం ప్రజలు కృషి చేయాలని డిప్యూటీ మేయర్ వందనాల దుర్గాభవాని పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా 47వ డివిజన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దుర్గాభవాని మాట్లాడుతూ తడి, పొడిచెత్త, ప్రమాదకరమైన వ్యర్థాలు వేరు చేసి ఇవ్వడంలో ప్రజలు సహకరించాలని కోరారు. స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత వందనాల శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికపై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, నియోజకవర్గ ఎమ్మెల్సీ పరిశీలకుడు పుచ్చ విజయ్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు అనపర్తి వెంకట నారాయణ హజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ మండలాధ్యక్షులు, ఎమ్మెల్సీ బూత్ ఇన్‌చార్జీలు, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జీలు హాజరు కావాలని తెలిపారు.

శ్రీవారికి ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : మాఘ పౌర్ణమి సందర్భంగా రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆంజనేయ వాహనంపై అలంకరించి ప్రత్యేక హారతులిచ్చి అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు, టిటిడి స్వర్ణ పతక గ్రహీత శ్రీమాన్ కిళాంబి వేంకట పవన్‌కృష్ణమాచార్యులు, వేద పండితులు బ్రహ్మశ్రీ యనమండ్ర వేంకట రవిప్రకాష్ శర్మ అవధానిలు భక్తులతో పూజలు, అర్చనలు జరిపించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ డిగ్రీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మాస్టర్ ఫిలాసఫీ, పీహెచ్‌డీ డిగ్రీలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, ఈ నెల 17వ తేదీలోగా జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని, నేరుగా మెయిల్ ద్వారానైనా పంపవచ్చని తెలిపారు. అర్హులైన వారికి 19న మౌకిక పరీక్ష నిర్వహిస్తామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

అంగన్‌వాడీలను బలోపేతం చేయాలి : ఐసీడీఎస్ పీడీ

పెదపాడు/పెదవేగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్టు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శారద తెలి పారు. పెదపాడు మండలం వట్లూరు హైస్కూల్లో అంగన్‌వాడీ టీచర్లకు జరు గుతున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేళ్ల లోపు చిన్నారుల్లో పోషణ, ఆటపాటలతో విన్యను నేర్పించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో ఎం.ఎస్.రాజశేఖర్, ఈవో మల్లిక, సూపర్‌వైజర్లు కుమారి పాల్గొన్నారు. పెదవేగి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సి.హెచ్. పార్వతి ఆధ్వర్యంలో పెదవేగి, విజయరాయి గ్రామాల్లో మూడు రోజుల పాటు శిక్షణను ఏర్పాటు చేశారు. విజయరాయిలో జరిగిన శిక్షణ తరగతుల్లో విజయ రాయి సెక్టార్ సూపర్‌వైజర్ మేరీబాయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రం - ఉపాధి అవకాశాలపై అవగాహన

పెదపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని రెడ్డి మహిళా కళాశాలలో రసాయన శాస్త్రం - ఉపాధి అవకాశాలు అనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు ఎం.శాంత కుమారి మాట్లాడుతూ కంప్యూటర్‌తో మాత్రమే భవిష్యత్తు లేదని, ప్యూర్ సైన్స్‌కి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరళ, చలసాని విశ్వనాధరావు, ఝాన్సీలక్ష్మి, తులసికోటేశ్వరిబాయి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీపీఐ నేతలకు వర్ధంతి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అభివృద్ధికి, ఏఐటీయూసీ అభివృద్ధికి సీపీఐ నేతలు మర్రాపు సత్యనారాయణ, వంకినేని శైలజ మల్లికార్జునుడు విశేష కృషి చేశారని ఏఐటీయూసీ నాయకులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కొత్తపేటలోని ఫ్రెండ్స్ సర్కిల్ సెంటర్‌లో మర్రాపు, వంకినేనిల వర్ధంతిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బి.రాంబాబు, వై.శ్రీనివాస్, ఎస్.సంజీవరావు, కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

కామవరంలో రెండో రోజు అమ్మవార్ల జాతర

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామవరంలో కొలువైన శ్రీదుర్గమ్మ, శ్రీగుబ్బల మంగమ్మ, శ్రీనాగదుర్గాదేవి, గద్దె రాజుల మాఘ శుద్ధ పౌర్ణమి గిరిజన జాతరను రెండవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి వర్స పుల్లారావు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్లను డోలుమేళాల సన్నాయిలతో గుబ్బల మంగమ్మ ఆలయానికి తీసుకొచ్చినట్టు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

ఆత్మహత్య బెదిరింపుపై పోలీసుల కౌన్సెలింగ్

భీమడోలు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : అప్పులు చేసిన కుమారుడిని తండ్రి మందలించాడంతో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. భీమడోలు మండలం కురేళ్ళగూడెం గ్రామంలో ఈ ఘటన జరిగింది.కీళ్ళ సీతారామయ్య కుమారుడు ధనుష్ స్థోమతకు మించి అప్పులు చేసి తండ్రిపై ఒత్తిడి తెచ్చాడు. విసిగిపోయిన తండ్రి మందలించడంతో ధనుష్ ఇంటి నుంచి వెళ్ళిపోయి ఆత్మహత్య చేసుకుంటానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో తండ్రి చేసేది లేక భీమడోలు పోలీసులను ఆశ్రయించాడు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ స్పందించి ఐపీకోర్ టీమ్ సాయంతో కేవలం 30 నిమిషాల్లో ధనుష్‌ను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.

వైసీపీ నవరత్నాలన్నీ నకిలీవే : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నవరత్నాలన్ని నకిలీవేనని ఎమ్మెల్యే బడేటి చంటి ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పారదర్శక పాలన సుస్థిరాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకురాలు ఆచంట సునీత, చోడే వెంకట రత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, సీహెచ్‌వీ సత్యవరప్రసాదరావు, బెల్లంకొండ కిషోర్, పూజారి నిరంజన్, నాయుడు సోము పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ లోగో ఆవిష్కరించిన డీఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మరణించిన మిత్రుల జ్ఞాపకార్థం వారిని స్మరించుకుంటూ క్రికెట్ టోర్నమెంటును నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరుకు చెందిన స్నేహాంజలి మెమోరియల్ క్రికెట్ టోర్నమమెంట్ సీజన్ 12 లోగోను ఏలూరులోని ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఐఎస్ అకాడమి కోచింగ్ సెంటర్‌లో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నుంచి మరణించిన స్నేహితులను స్మరించుకుంటూ వారి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించుకోవడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని అన్నారు.



దుకాణాల వెనుక డ్రెయినేజీలు



చింతలపూడి పట్టణ వ్యూ



మెయిన్ రోడ్డులో డ్రెయినేజీ దుస్థితి

అటకెక్కిన అభివృద్ధి..

పన్నుల వసూళ్లు ఓకే, సౌకర్యాల సంగతేంటని అడుగుతున్న ప్రజలు - డ్రెయినేజీల దుస్థితిపై అసహనం

చింతలపూడి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీగా ఏర్పడి ఐదేళ్లవుతోంది. పాలకవర్గంలేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఈ నాలుగేళ్ళల్లో ఐదుగురు కమిషనర్లు మారినా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. పన్నులు మాత్రం మునిసిపల్ స్థాయిలోనే పెంచి వసూలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.మౌలిక సదుపాయాల్లో ప్రధానమైన డ్రెయినేజీ, మంచి నీరు, రోడ్లు, వీధి దీపాలు అధ్వానంగా ఉన్నాయి. ఇందులో ప్రధానమైన శాశ్వత డ్రెయినేజీ నిర్మాణం ఎప్పుడని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మేజర్ పంచాయతీలో ఉన్నప్పుడు ఉన్న డ్రెయిన్‌నే తప్ప ఎక్కడా మురుగు వెళ్లేందుకు ఒక్క డ్రెయిన్ కూడా నిర్మించలేదు. ఫలితంగా వీధుల్లోను, రోడ్లపైన మురుగు చేరి తరచూ రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ఈ అపరిశుభ్ర వాతావరణంతో దోమలు వ్యాపిస్తున్నాయి. దీనికితోడు పైపులైన్ల లీకేజీలు, గృహాల్లో వినియోగించే నీరు వెళ్లేందుకు దారిలేక వీధులలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి.చింతలపూడి పట్టణం ఎటు చూసినా మూడు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2006లో మెయిన్ రోడ్డు విస్తరణ జరిగినప్పుడు రోడ్డుకిరువైపులా కేవలం 800 మీటర్లు మాత్రమే డ్రెయినేజీ నిర్మించారు. ఇవి కూడా మురుగు పోయే దారిలేక పూడిక పేరుకుపోతున్నాయి. దీంతో తరచూ మునిసిపల్ అధికారులు డ్రెయినేజీ మీద రాళ్ళు తీయడం, ఆక్రమణల పేరుతో డ్రెయిన్ల మీద రాళ్ళు తొలగించడం వలన అసలే ఇరుకు రోడ్లతో అధ్వాన్నంగా తయారవుతున్నాయి. మరో వైపు పొరుగు గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలకు కనీసం ఒక్క వాష్ రూమ్ కూడా ఉండడం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు శాశ్వత డ్రెయినేజీ నిర్మాణం పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.



కల్వర్టు కింద, మెయిన్ రోడ్డులో డ్రెయినేజీల పరిస్థితి

మురుగు పోయేదారిలేదు : డి.శ్రీనివాసరావు, మారుతీనగర్



మారుతీ నగర్‌లో నివాసాలు భారీగా పెరిగాయి. డ్రెయినేజీ సౌకర్యం లేదు. మురుగు రోడ్లపైకి చేరుతోంది. మెయిన్ రోడ్డు పక్కనే మురుగు కోసం ఓ గాడిని తవ్వారు, ఆ గోతుల్లో నీరు చేరి అధ్వాన్నంగా మారుతోంది. ఇప్పటికైనా మా సమస్యను అర్థం చేసుకోండి..

సీసీ డ్రెయిన్ల కోసం ప్రతిపాదనలు : డి.పావని, కమిషనర్



సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. 53 కిలోమీటర్ల మేర డ్రెయినేజీలను నిర్మించాల్సి ఉంది. మురుగు చెరువుల్లోకి వెళ్లకుండా అవుట్‌లెట్లు నిర్మించాల్సి ఉంది. ఇంజనీరింగ్ సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. సీసీ డ్రెయిన్లతో పాటు వాటర్ సిస్టం త్వరలో మెరుగుపరుస్తాం.

జాగ్రత్తలతోనే అదుపులో బర్డ్ ఫ్లూ

రైతులకు సూచిస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గోవిందరాజులు

ఏలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఇతర కోళ్ళ, పక్షులకు వ్యాపించకుండా నివారించవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.బర్డ్‌ఫ్లూ కోళ్ళు, బాతులు, ఇతర పక్షులకు వేగంగా వ్యాపిస్తుంది.హెచ్5ఎన్ 1 అనే వైరస్ వల్ల ఇది వ్యాప్తి చెందడానికి అవకాశముంది. ప్రధానంగా విదేశాల నుంచి వచ్చే వలస పక్షుల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలున్నాయి.అదీ కూడా చలికాలం తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలోనే ఈ వైరస్ వ్యాపిస్తుంది. ఎండలు ముదిరితే వైరస్ విస్తరణ జరగదు. కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో పక్షిసంతతి ఉత్పత్తికి వచ్చే పక్షి జాతులు ఫౌల్ట్రీలోని ఈగలు, పురుగుల తినడానికి వస్తుంటాయి. అవి విసర్జించే వ్యర్థాల ద్వారా కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాపించే అవకాశం ఉందని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గోవిందరాజులు తెలిపారు. చలి కాలంలో పక్షి జాతుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో, కోళ్లు బలహీనపడి గుడ్ల ఉత్పత్తి సైతం తగ్గిపోతుంది. కోళ్లు జారవిడిచే సొంగ ద్వారా ఈ వ్యాధి ఒక కోడి నుంచి మరో కోడికి త్వరగా వ్యాపిస్తుందన్నారు. కోడిలోని వివిధ శరీర అవయాలు దెబ్బతిని 48 గంటల్లో చనిపో తాయి. ఈ వైరస్ అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే మనుషులకు సోకుతుంది. కోళ్లలో ఈ వైరస్ పేగులకు సోకి అవయాలన్నీ చచ్చుబడతాయి. విదేశీ వలస పక్షులు విసర్జించే రెట్టలు జలాశయాల్లో చేరి అక్కడి నుంచి కోళ్లకు సంక్రమిస్తుంది.



జేడీ గోవిందరాజు

తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే...

పౌల్ట్రీఫారాల్లో ఈ వ్యాధి వ్యాపిస్తే లక్షల్లోనే కోళ్లు తుడిచిపెట్టుకుపోతాయి. 3 లక్షలు కోళ్లు ఉండే ఒక ఫౌల్ట్రీలో 2.40 లక్షల వరకు చనిపోతాయి. వ్యాధి నిరోధక శక్తి ఉన్నవి మాత్రమే బతుకుడానికి ఛాన్సు ఉంటుందని గోవిందరాజులు తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు మండలం బాదంపూడిలో బర్డ్ ఫ్లూ సోకిందనే సమాచారంతో శాంపిల్స్‌ను భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డీసీజెస్ ల్యాబ్‌కు పంపారు. అది బర్డ్ ఫ్లూ అని నిర్ధారణవడంతో అలర్ట్ జారీ చేశారు. వైరస్ సోకిన ప్రాంతం నుంచి 10 కిలోమీటర్ల మేర బర్డ్‌ఫ్లూ విస్తరించే అవకాశం ఉంది. ఈ వ్యాధి సోకిన కోళ్లను, అవి పెట్టే గుడ్లను గుంతలో పూడ్చించాలని, కోళ్ల వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎత్తివేసి పరిశుభ్రం చేయాలని అన్నారు.అలాగే కోళ్ల ఫారాల్లో పనిచేస్తున్నవారి ఆరోగ్య పరిస్థితిని గమనిస్తున్నట్టు తెలిపారు..

పాతపెదపాడులో కోళ్ల ఫారాల పరిశీలన

పెదపాడు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ వైరస్ కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో కోళ్లఫారాల యజమానులు ఫారాల నిర్వహణలో పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కృష్ణ జ్యోతి సూచించారు. పెదపాడు మండలం పాతపెదపాడులో ఉన్న కోళ్లఫారాన్ని ఎంపీడీవో అమీలు జమ, పశువైద్యాధికారిణి సంధ్యవాణిశ్రీతో కలిసి గురువారం తనిఖీ చేశారు. కోళ్లఫారం షెడ్డుల్లో తీసుకుంటున్న ముంద జాగ్రత్త చర్యలను సమీక్షించారు. షెడ్లలోని కోళ్ళని పరిశీలించాలని, కోళ్ల ఏమైనా మరణిస్తే వెంటనే ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. లోనికి వెళ్లే సమయంలో మాస్కులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నరసింహ పాల్గొన్నారు.



కోళ్ల ఫారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ఏలూరు/ద్వారకాతిరుమల/లింగపాలెం/నిడమర్రు/కొయ్యలగూడెం/టి.నరసాపురం, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): కూటమి బలపరచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు పారేపల్లి రామారావు విజ్ఞప్తి చేశారు. జంగారెడ్డిగూడెం టిడిపి మండలాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో చక్రదేవరపల్లిలో అవగాహన కల్పించారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం జడ్పీ హైస్కూల్లో టిడిపి నేతలు ప్రచారంపై అవగాహన కల్పించారు. లింగపాలెం మండలంలో ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి జి.విజయ్‌సుందర్ కలిసి ప్రచారం నిర్వహించారు. ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు నిడమర్రు మండలం క్రొవ్విడి, బావాయి పాలెం, సిద్ధా పురం, ఛానమిల్లి గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. టి.నరసా పురంలోని విజయ లక్ష్మి థియేటర్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రణాళిక సమావేశం ఏపీ రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ఎమ్మెల్సీ ఓటు అడుగుతున్న మాజీ ఎమ్మెల్యే గన్ని

పెన్షన్ సొమ్ము మాయంపై ఫిర్యాదు

పోలవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో జనవరిలో పంపిణీ చేసిన సొమ్ములో 50 వేల రూపాయలు తక్కువగా వచ్చాయని బ్యాంకు అధికారులను సంప్రదిస్తే స్పందన లేకుండా పోయిందని ఎంపీడీవో ఇ.శ్రీనివాస్ గురువారం పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బ్యాంకు నుంచి వచ్చిన సొమ్ము తగ్గిన విషయంలో చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులకు కోరామని సీసీ ఫుటేజీలు పరిశీలించడానికి సైతం బ్యాంకు అధికారులు స్పందించడం లేదని ఈ విషయంపై వాస్తవాలు రాబట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.



అభినందిస్తున్న ఎమ్మెల్యే బడేటి

జేఈఈ మెయిన్స్ టాపర్లకు ఎమ్మెల్యే అభినందన

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నగర టాపర్లుగా నిలిచిన నారాయణ కళాశాల విద్యార్థులు లంక అభినవ్, ప్రశాంత్ కుమార్‌లను గురువారం స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి అభినందించారు. జాతీయ స్థాయి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించి ఏలూరులో ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. పోటీ పరీక్షలకు ఉత్తమ విద్యను అందిస్తున్న నారాయణ విద్యా సంస్థలు భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్ రమేష్, ప్రిన్సిపాల్స్ రాము, మురళి, ఏజీఎం సందీప్ పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం దత్తత ఆలయమైన తూర్పు వీధిలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఈ నెల 8న ప్రారంభించిన బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై అలంకరించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం విజయ రాఘవా చార్యులు బృందం భక్తులతో పూజలు చేయించారు.



ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక శివనగర్‌లోని వంతెన వద్ద గల భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పంచమ ప్రతిష్టా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరత్నం శర్మ బృందం స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం పుష్పాలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి నివేదనలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.



సాగులో సూచనలు పాటించాలి

లింగపాలెం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : పంట దిగుబడులు పెరగాలంటే కాలానుగుణంగా ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీ కృష్ణ అన్నారు. ఈ మేరకు లింగపాలెంలో ఆయన వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పంటలో ఏమైనా తెగుళ్ల కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. రసాయన ఎరువులతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. రైతులు తమ పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలన్నారు.

కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలి

ఏలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలో కగార్ ఆపరేషన్ పేరుతో ఆదివాసీలపై చేసే దాడులను వెంటనే నిలిపివేయాలని ప్రజా సంఘాలు, వామ పక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెంలోని ధర్మన్న మెమోరియల్ హాల్లో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అధ్యక్షతన వామపక్షాల ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు ధర్మల సురేష్, జె.వి.రమణ రాజు, కుంచె వసంత రావు, సరియం రామ్మోహన్, టి.బాబూ రావు, బి.వినోద్, ముక్కారెడ్డి పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోవాలి

పెదవేగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : దంతాల ఆరోగ్యంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ దంతాలను సంరక్షించుకోవాలని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో గురువారం ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శనివారపు పేట నుంచి దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల వరకు ప్రదర్శన చేసి, దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ విభాగాధిపతి డాక్టర్ వీఆర్.చంద్రబాబు, డాక్టర్ కె.శ్రీకాంత్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ గౌతమ్, దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులు తమ విద్యాభ్యాసకాలంలో కీటకజనిత వ్యాధులపై సంపూర్ణ అవగాహన ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ సూచించారు.ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు డీఎంహెచ్‌వో కార్యాలయం మలేరియా విభాగంలో గురువారం దోమలద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు.అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు మాట్లాడుతూ దోమల జీవన చక్రం గురించి వివరించారు. వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అభిలాష్, నూర్జహాన్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఒక మహిళ అదృశ్యమైందని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎస్ఐ షేక్ మదీనాబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కొత్తగూడెం రోడ్డులోని పోతురాజు గుడి సమీపంలో నివాసం ఉంటున్న షేక్ షాహిన (27)కు వివాహమైంది. ఈనెల 12న పనికి వెళ్తున్నానని భర్త కాలీషాకి చెప్పి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి ఆమె కానరాకపోవడంతో కాలిషా గురువారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్వ్యూ..

సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలు

వెన్నా శ్రీలత, ఎంపీడీవో, ఏలూరు



• మినీ గోకులాల పరిస్థితి ఏమిటి?

జవాబు : ఏలూరు రూరల్ మండలంలో 20 మినీగోకులాలు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాం. ఒక్కో గోకులానికి రూ.2.30 లక్షలు ఖర్చు చేస్తున్నాం.

• పల్లెపండుగ పనుల ప్రగతి ఏమిటి?

జవాబు : ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో పనులపై దృష్టి పెట్టాం. పల్లెపండుగలో భాగంగా రోడ్లు, డ్రెయిన్‌లు, నిర్మాణం జరుగుతోంది. 17 పనులను త్వరలో పూర్తి చేస్తాం.

• సచివాలయాల పనితీరు ఎలా ఉంది?

జవాబు : మండలంలో 15 వార్డు సచివాలయాలు ఉన్నాయి. ప్రతినెలా పింఛన్లు పంపిణీ చేయడంలో, పనులు వేగవంతం చేయడంలో సూచనలిస్తున్నాం. విధి నిర్వహణలో అలసత్వానికి తావు ఇవ్వొద్దంటూ సూచిస్తున్నాం.

• మండలాభివృద్ధిపై మీ చర్యలు?

జవాబు : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

- ఏలూరు రూరల్

ప్రతిభావంతులకు సాయం

దెందులూరు, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి) : దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం విద్యతోనే సాధ్యమని ఆకుల నరసింహరావు ఉమా లక్ష్మీ ట్రస్టు ఛైర్మన్ ప్రముఖ ఎన్ఆర్ఐ ఆకుల శ్రీధర్ అన్నారు. దెందులూరు శ్రీగారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన రామిశెట్టి నాగమాణిక్యం, రూ.2 వేలు, ఎం.పార్థుకు రూ.1500 షేక్ తనీషాకు 1500 రూపాయలను ట్రస్టు తరపున ట్రస్టు ఛైర్మన్ ఆకుల శ్రీధర్ అందజేశారు. పాఠశాలలో షెడ్డు నిర్మాణానికి రెండు లక్షలు అందజేస్తానని ఆకుల శ్రీధర్ ప్రకటించారు.

పోషణపై అవగాహన

దెందులూరు, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లలోపు చిన్నారులకు మెదడు అభివృద్ధి చెందుతుందని, అందుకే అంగన్ వాడీల్లోని చిన్నారులకు మంచి ఆహారంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలని పెదపాడు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కొవ్వలిలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ టీచర్లతో పోషణ, విద్య అనే కార్యక్రమంలో భాగంగా సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అలాగే దెందులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు.

పేకాట శిబిరంపై దాడి

ఏలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెంలోని మార్కండేయపురం శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో పదకొండు మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. లక్షా 38వేల 400 నగదు స్వాధీనం చేసుకున్నారు. పదకొండు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కె.జబీర్ తెలిపారు.

ఘనంగా వీరభద్రుని రథోత్సవం

కామవరపుకోట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక భద్రకాళీ సహిత వీరభద్ర స్వామి ఆలయం వద్ద ఈ నెల 8వ తేదీ నుంచి జరుగుతున్న కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని మేళతాళాల మధ్య వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పుర వీధుల్లో భక్తులు స్వామికి హారతులిచ్చి మొక్కుబడులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏడాది కళ్యాణోత్సవాలను అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

భీమడోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ టీచర్లకు 13 నుంచి 17 వరకూ చిన్నారుల విద్యాబోధన, పోషకాహార పంపిణీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు. భీమడోలు, గుండుగొలను జడ్పీ హైస్కూళ్లలో మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు.

భీమడోలులో జాతర

భీమడోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : భీమడోలులో జాతరను వైభవంగా నిర్వహించారు. భీమడోలులోని పెరుమాళ్ళ స్తంభం ప్రాంతం నుంచి వెలమపేట తదితర ఏరియాల్లో భీమడోలు గ్రామ దేవతలు శ్రీగంగానమ్మ,పోతురాజుబాబు, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ అమ్మవార్ల ఊరేగింపుగా మేళతాళాలు, మంగళవాయిద్యాలతో గ్రామ సంచారం నిర్వహించారు. అమ్మవార్లు, పోతురాజుకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొయ్యలగూడెం/ పెదవేగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : కొయ్యలగూడెం ఫీడర్‌లోని కొయ్యలగూడెం, బోడిగూడెం సబ్ స్టేషన్ 33కేవీ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు నిలిపివేస్తున్నట్టు జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ డీఈ అహ్మద్‌ఖాన్ తెలిపారు. పెదవేగి మండలం కొప్పాక విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కార ణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎస్ ఏలూరు ఈఈ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు.




అడ్డుగా ఉన్న కారు తీయాలని అభ్యర్థిస్తున్న చింతమనేని గన్‌మెన్, దాడిపై పోలీసులకు ఫిర్యాదు

చింతమనేని, డ్రైవర్‌పై వైసీపీ వర్గీయుల దాడి

మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, అనుచరులపై కేసు

పెదవేగి/ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, అనుచరులు దాడి చేశారంటూ కేసు నమోదైంది. వివరాలివి.. ఎమ్మెల్యే చింతమనేని వద్ద ఏలూరు కండ్రికగూడెంకు చెందిన మానుకొండ సుధీర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 9.30 గంటల సమీపంలో వట్లూరు - సీతారామపురం రోడ్డులో పద్మావతి కన్వెన్షన్ హాలులో ఒక వివాహానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. డ్రైవర్ కారు వద్ద ఉన్నారు. ఇంతలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌చార్జి కొఠారు, ఆయన అనుచరులు కలిసి కారు అడ్డుపెట్టి డ్రైవర్‌పై దాడి చేశారు. ప్రశ్నించిన డ్రైవర్‌ను కులంపేరుతో దూషించి కొట్టారు. కొఠారు, ఆయన అనుచరులు చంపడానికి ప్రయత్నించారని డ్రైవర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పుడే వచ్చిన ఎమ్మెల్యే ప్రభాకర్‌పైన దాడికి ప్రయత్నించారని అడ్డుకోబోయిన గన్‌మెన్ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్) వద్ద ఉన్న గన్ తీసుకుని కాల్చడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రధాన నిందితుడిగా అబ్బయ్య చౌదరి, వేమూరి జితేంద్ర, జానంపేట బాబు, విజయ్‌బాబు, మట్టా ప్రవీణ్, పామర్తి వీర్రాజు, ఉప్పలపాటి సాయిరామ్‌చౌదరి, చల్లారి హేమంత్, పొన్నూరి నాగరాజు మరికొందరు దాడిలో పాల్గొన్నారని పేర్కొనడంతో వారందరి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

దాడి విషయం తెలుసుకున్న టీడీపీ వర్గీయులు దుగ్గిరాలలోని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇంటికి భారీగా చేరుకున్నారు. వైసీపీ వర్గీయులు కొఠారు అబ్బయ్యచౌదరి స్వగ్రామం కొండలరావుపాలెం చేరుకున్నారు. పోలీసులు ఈ గ్రామాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, వివా దం పెరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఉద్దేశ పూర్వక దాడి : చింతమనేని



శుభకార్యం వద్ద కారు అడ్డుపెట్టి గొడవ పెట్టు కుని ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం సిగ్గు చేటని ఎమ్మెల్యే చింత మనేని మండిపడ్డారు. గురువారం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను కలసి నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివాహ వేడుక వద్ద అబ్బయ్య చౌదరి కారు అడ్డుపెట్టారని, అక్కడ ఉన్న సెక్యూరిటీ చెప్పినా కారు తీయకుండా ఉద్దేశ పూర్వకంగానే గొడవ పెట్టుకుని తన డ్రైవర్‌పై, తన గన్‌మెన్‌పై దాడికి దిగారని చెప్పారు. చట్టాన్ని చేతిలోకి తీసుకుని ప్రవర్తిస్తున్నారని తప్పు చేసిన వారు ఈ రోజు కాకపోయినా రేపైనా శిక్ష అనుభవిం చాల్సిందేనన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారని చెప్పారు. తప్పు చేసిన వారు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే పరిణామాలు వేరేగా ఉంటాయని హెచ్చరించారు.

కక్ష సాధింపు చర్యలు : కొఠారు



ఎమ్మెల్యే చింతమనేని తమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొఠారు ఆరోపించారు. పెళ్లి వేడుక ఘటనపై గురువారం ఏలూరులో విలేకరులతో మాట్లా డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజు ల్లోనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నా రని, ఇది రెడ్ బుక్ రాజ్యాంగమా, టీడీపీ రాజ్యాంగ మా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు సమర్ధనీయం కాదని, ఇకనైనా చింతమ నేని తన ప్రవర్తనను మార్చుకోవాలని చెప్పారు.

ప్రభావతి కుటుంబ సభ్యులకు పోలీసు సమన్లు



డి.ప్రభావతి

నూజివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు మేనేజరుగా సస్పెండ్ అయ్యి గ్రామంలో గొడవలు పడుతున్న దావులూరి ప్రభావతి, ఆమె కుటుంబ సభ్యులపై సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్‌కు బైండోవర్ నిమిత్తం పోలీసులు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమన్లు జారీ చేశారు. సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజును కలిసి తమ వాదనలు వినిపించడానికి కొంత సమయం కావాలని దావులూరి ప్రభావతి, ఆమె కుటుంబ సభ్యులు కోరారు. వివరాల్లోకి వెళితే కొద్దినెలల క్రితం నూజివీడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కె.యోగేశ్వరరావు తన 383 గ్రాముల బంగారు నగలు గంగూరు బ్రాంచ్‌లో మేనేజరుగా ప్రభావతి పనిచేస్తున్న బ్యాంకులో కుదువపెట్టాడు. బంగారాన్ని బ్యాంకు మేనేజరు కాజేయడంతో యోగేశ్వరరావు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం విధుల నుంచి ఆమెను సస్పెండ్ చేశారు. దావులూరి ప్రభావతిపై ఏలూరు, కృష్ణాజిల్లాల్లో ఇప్పటికే 13కేసులు నమోదు కాగా, నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ సైతం ఓపెన్ అయిం ది. సస్పెండ్ అయిన అనంతరం స్వగ్రామం చేరుకున్న ఈమె తన కుటుంబసభ్యులతో కలిసి గ్రామంలో పలువురితో గొడవలు పడుతుం డడంతో వారి ఫిర్యాదు మేరకు పోలీస్ విచారణ చేసి రౌడీషీట్ సైతం ఓపెన్ చేశారు. అయినా ఆమె ఆగడాలు ఆగక పోవడంతో బైండోవర్ చేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్‌కు పోలీసులు నివేదిక పంపారు.

చర్యలు చేపడతాం : సబ్ కలెక్టర్

పోలీసులు పూర్తిస్థాయి నివేదిక అందించారని సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ తెలిపారు. సమన్లు జారీ చేయడంతో ప్రభావతి, ఆమె కుటుంబసభ్యులు కలిసి వివరణ ఇవ్వడానికి కొద్దిరోజులు గడువు కోరారు. ఇప్పటికే పోలీస్ నివేదిక అందిందని వారి వివరణ వచ్చిన తరువాత చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ విలేకర్లకు గురువారం తెలిపారు.

రహదారి భద్రత అందరిది : ఆర్టీవో



నూజివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నూజివీడు లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్లో ప్రాంతీయ రవాణా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆర్‌టీవో జి.నాగమురళీ మాట్లా డుతూ ప్రతి డ్రైవర్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లారీ డ్రైవర్స్, ఇతర వాహ నాలు నడిపే డ్రైవర్లకు డిఫెన్స్ డ్రైవింగ్, గుడ్ సమరిటన్ లా వివరించారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు లారీ, ఆటో, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ముసునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో తిరువీధి లక్ష్మీరామారావు సేవాట్రస్ట్, ఎస్ఎస్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎస్.కె నయాబ్ రసూల్, డాక్టర్ జమ్రుద్ షాహీన్ 200 మందికి కంటి పరీక్షలు చేశారు. 20 మందికి కళ్లజోడు అవసరమని, 18 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని గుర్తించారు. ఆపరేషన్లు ఉచితంగా ట్రస్ట్‌ద్వారా చేయిస్తామని చైర్మన్ తిరువీధి కృష్ణ తెలిపారు. ట్రస్ట్ సభ్యులు నాగబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా పట్టభద్రుల ఎన్నికల ప్రచారం



ఎమ్మెల్సీ ఓటు అభ్యర్థిస్తున్న శివనాగరాజు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని రైతుసంఘం మండల నాయకులు చాకిరి శివనాగరాజు కోరారు. ఆగిరిపల్లి, పలు గ్రామాల్లో రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, గృహాల వద్ద గురువారం ప్రచారాన్ని నిర్వహించారు. షేక్ జహంగీర్‌భాషా, ముత్యాల నరేష్ పాల్గొన్నారు.

వేసవిలో కాల్వలు అభివృద్ధి చేయాలి

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : వేసవిలో కాల్వల ఆధునికీకరణ పనులను నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు మండలం వరహాపట్నం లోని ఆయన నివాసం వద్ద గురువారం నియోజకవర్గంలోని డీసీ చైర్మన్లు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో కాల్వలు అధ్వానంగా ఉన్నాయని వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని చేయాల్సిన పనులను ప్రణా ళికబద్ధంగా చేయాలన్నారు. పంట కాల్వలు, డ్రెయిన్లలో చెత్త, కిక్కిస తొలగించాలన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి రాకుండా అన్ని మంచినీటి చెరువులకు నీరు సరఫరాల అయ్యేలా నీటి సంఘాల అధ్యక్షులంతా చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు తదితరులు పాల్గొన్నారు.



మండవల్లిలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్సీ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దృశ్యం

ఆలపాటిని గెలిపించాలంటూ ప్రచారం

మండవల్లి ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మొదటి ప్రాధాన్యతనిచ్చి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి కోరారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మండవల్లిలో గురువారం కరపత్రాలు అందజేశారు. నీటి సంఘ అధ్యక్షుడు కూనపరెడ్డి కోటేశ్వరరావు, బూత్ కన్వీనర్ గుడివాడ గణేష్, బూత్ కన్వీనర్ కారే రాజు, రాజేష్, చంద్రశేఖర్, ఉదయ్‌కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

52 శాతం పూర్తయిన రీ సర్వే

ముదినేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పైలట్ ప్రాజెక్టు కింద రీసర్వేకు ఎంపికైన చినకామనపూడి గ్రామ ఏరియాలో భూముల సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఆ గ్రామ ఏరియాలో సుమారు 600 ఎకరాల ప్రైవేట్ భూముల రీసర్వే జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 320 ఎకరాల విస్తీర్ణంలో 52 శాతం పూర్తయింది. గురువారం తహసీల్దార్ సుభానీ సర్వే తీరును పరిశీలించారు. రీసర్వే డీటీ శ్రీనివాసప్రసాద్, మండల సర్వేయర్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు.



చినకామనపూడిలో రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభానీ



చోరీకి పాల్పడిన విధానాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాచపట్నంలో చోరీ.. రూ.50 వేలు అపహరణ

కైకలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో దొంగలు రూ.50 వేలు నగదును అపహరించినట్టు కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపారు. రాచపట్నంలో కొవ్వూరు వెంకటేశ్వరరావు ఇంటిలో బుధవారం రాత్రి ఈ చోరీ జరిగింది. నూతనంగా ఇల్లు నిర్మాణం చేసుకుని, పౌరోహిత్యం చేసుకుంటూ జీవిస్తున్న వెంకటేశ్వరరావు వింజరంలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఇంటిలోని బీరువాలోని రూ.50 వేలు అపహరించినట్లు గుర్తించారు. కైకలూరు టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ కృష్ణ, ఎస్‌ఐ శ్రీను క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను తీసుకు వచ్చి ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పోలరాజ్ కెనాల్‌లోకి దూసుకెళ్లిన కారు



మండవల్లి ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం కానుకొల్లు వద్ద గేదెను తప్పించబోయి అదుపుతప్పి కారు పోలరాజ్ పంటకాలువలోకి దూసుకెళ్లింది. స్థానికుల సమాచారం ప్రకారం భీమవరం వైపు నుంచి మచిలీపట్నం వెళ్తుండగా గురువారం మధ్యాహ్నం కానుకొల్లు వద్ద కారుకు గేదె అడ్డు వచ్చింది. ఆ గేదెను తప్పించబోయి కారు అదుపుతప్పి పోలరాజ్ కాల్వలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరున్నారని ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాలేదు. స్థానికుల సహాయంతో కాల్వలో నుంచి కారును బయటకు తీశారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి

క్యాలెండర్ ఆవిష్కరణ

నూజివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను మంత్రి కొలుసు పార్థసారధి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏలూరు జిల్లా టీఎన్‌యూఎస్ కమిటీ సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, చింతయ్య, ఏసుపాదం పాల్గొన్నారు.

చిన్నంపేటలో సారా పట్టివేత

చాట్రాయి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు చేశారు. కొమ్ము సురేష్ వద్ద 5 లీటర్లు, కందుల ప్రభాకరరావు వద్ద 5 లీటర్లు సారా స్వాదీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు పణికుమార్, మస్తానయ్య తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ

ముసునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ -16 బాస్కెట్ బాల్ పోటీల్లో రమణక్కపేట జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థి టి.నాగసుధ, డి.భార్గవి కీలకపాత్ర పోషించడంతో ద్వితీయస్థానం సాధించారు. వారిని హెచ్ఎం రామకృష్ణారావు, పి.డి వాకా నాగరాజు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

జనరంజక పాలన మెచ్చే టీడీపీలోకి వలసలు : మంత్రి



సూర్యనారాయణకు కండువా కప్పుతున్న మంత్రి

చాట్రాయి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనకు మెచ్చి చాలా మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నారని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. బూరుగుగూడెంలో వైసీపీలో క్రియాశీలంగా పని చేస్తున్న కాలసాని సోదరులు సూర్యనారాయణ, చెన్నారావు నాయకత్వంలో సుమారు 200 మంది గురువారం మంత్రి సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, రాష్ట్రానికి పూర్వవైభవం తేవడానికి సీఎం చంద్రబాబు కష్టపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాసరావు, బొట్టు రామచంద్రరావు, అత్తులూరి శ్రీనివాసరావు, మరిడి చిట్టిబాబు, కందుల కృష్ణ, దామెర చిట్టిబాబు, నోబుల్‌రెడ్డి, చంద్రకళ, తల్లాడ శ్రీను వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శిస్తున్న మంత్రి

నూజివీడు : రావిచర్లకు చెందిన చెన్నారావు గురువారం ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురై గాయపడ్డాడు. మంత్రి పార్థసారధి చాట్రాయి మండలం పర్యటన అనంతరం తిరిగి వెళుతుండగా అతడిని గమనించి వాహనం దిగి పరామర్శించారు. అతడికి మెరుగైన వైద్యం అందించి, ద్విచక్ర వాహనాన్ని రిపేరు చేయించి ఇంటికి పంపించాలని స్థానిక తెలుగుదేశం నాయకుడు అక్కినేని చందుకు మంత్రి సూచించారు.

స్మార్ట్ టూల్స్‌పై మార్చి 3,4 తేదీల్లో వర్క్‌షాపు

నూజివీడు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి3,4 తేదీల్లో స్మార్ట్‌టూల్స్, స్మార్టర్ డిజైన్స్‌పై రెండు రోజుల పాటు జాతీయ వర్క్‌షాపు శ్రీకాకుళంలో నిర్వహించనున్నారు. నూజివీడు ఆర్జీయూకేటీ క్యాంపస్‌లోని శ్రీకాకుళం విభాగంలో గురువారం పోస్టర్స్ ఆవిష్కరించారు. ఆర్జీయూకేటీ ఏపీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, డీన్ శ్రావణి దువ్వూరి, ఈఐటిటి డీన్ టి.శ్యామ్, శ్రీకాకుళం డిప్యూటీ ఏవో ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ అధునాతన సివిల్‌ఇంజినీరింగ్ సాధనాలు, సాంకేతికతపై వర్క్‌షాప్ దృష్టిసారిస్తుందని తెలిపారు. అధిక-కచ్చితత్వ సర్వేయింగ్ కోసం ఎల్‌ఐడిఏఆర్, డీజీపీఎస్ వాడకం, స్కెచెస్ ప్రో, ఆటోకాడ్ త్రీడి ఉపయోగించి, భవనప్రణాళిక, డిజైన్, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చించడం జరుగుతుందన్నారు. నిపుణుల చర్చలు, ఆచరణాత్మక శిక్షణ, ఇంట్రాక్టివ్ చర్చలుంటాయని తెలిపారు. సామర్థ్యం, ఆవిష్కరణలను పెంపొందించడానికి స్మార్ట్ సాధనాలను ఇంజినీరింగ్ పద్ధతుల్లోకి అనుసంధాన ప్రాముఖ్యతను వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఆర్జీయూకేటీ శ్రీకాకుళంలోని నిర్వాహక బృందాన్ని సంప్రదించవచ్చని వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



గుడిపాడులో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈవో

ముసునూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. గుడిపాడు జడ్పీ పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించి ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు, పాఠశాల, మధ్యాహ్నం భోజనం రికార్డులను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు సులభతరమైన విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు

కలిదిండి/ముదినేపల్లి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్యంతో పాటు చదువు ముఖ్యమని అంగన్‌వాడీ సూపర్ వైజర్లు కరుణ కుమారి, ప్రసన్నలు అన్నా రు. కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్లకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ చి న్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దినప్పుడే ఆటల్లో చదువుల్లో రాణిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ స్త్రీ శిశు సంక్షేమశాఖ నిర్దేశించిన పోషణ్ బీ, పఢాబీ అనే నినాదంతో చేపట్టిన శిక్షణ కార్యక్రమాలను ముదినేపల్లి, పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు జానీ, సుందరమ్మలు నిర్వహించారు. మండలంలోని 90 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయాలి

కలిదిండి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలు, రాయితీలు వర్తించాలంటే రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ అబీబ్ బాషా అన్నారు. గురువారం సానారుద్రవరంలో రైతు విశిష్ట నమోదు సంఖ్య కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ఏడీ గంగాధర్, మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : ఎస్.ఐ

మండవల్లి ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ పెట్టకుండా వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామచంద్రరావు హెచ్చరించారు. కానుకొల్లు, లింగాల, పెరికేగూడెం, మండవల్లి గ్రామాల్లో వాహనాలు రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమానా విధించారు.

కైకలూరు : హెల్మెట్ ధారణతోనే వాహనదారులు ప్రమాదాల బారి నుంచి బయటపడతారని కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు అన్నారు. గురువారం కైకలూరు మండలం ఆలపాడులో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సరిహద్దులో ఉప్పుటేరు వద్ద వాహనదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం ఉండదన్నారు. ఈ సందర్భంగా రహదారి ప్రమాద పోస్టర్లను ఆవిష్కరించారు.

ముమ్మరంగా విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్లు

చాట్రాయి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. చాట్రాయి, నరసింహరావుపాలెం, బూరుగుగూడెం, ఆరుగొలనుపేట, జనార్ధనవరం రైతుసేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లను ఏవో శివశంకర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. రైతులతో ఏవో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విశిష్ట గుర్తింపు నెంబరు ఉన్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్, ఎరువులు, విత్తనాలు, మైక్రో ఇరిగేషన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర వ్యవసాయ ఉద్యాన పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులందరూ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో కోరారు.

నూతన వధువుకు బంగారు నాణెం

చాట్రాయి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యురాలు సీహెచ్ ధనలక్ష్మికి కృష్ణా మిల్క్ యూనియన్ బంగారు నాణెం అందజేసింది. ఆమె కుమార్తె నాగదివ్యకు వివాహం సందర్భంగా కల్యాణమస్తు పథకంలో కింద రూ.20 వేలు విలువైన బంగారు నాణేన్ని గురువారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, సంఘం అధ్యక్షురాలు గంగారత్నం అందజేశారు.



కె.కొత్తగూడెంలో వధువుకు బంగారు నాణెం అందజేస్తున్న దృశ్యం